మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 9-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 10 Issue: 10

09 జూలై 2026 - గురువారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - తె. 5:51, సూర్యాస్తమయం - సా. 6:50, తిథి, నవమి ఉ. 10:34 వరకు, తరువాత దశమి, సంస్కృత వారం, బృహస్పతి వాసరః, నక్షత్రం, అశ్విని మ. 2:50 వరకు, తరువాత భరణి, యోగం, సుకర్మ ఉ. 10:06 వరకు కరణం, గరజ ఉ. 10:34 వరకు, వనిజ రా. 9:26 వరకు, వర్జ్యం, ఉ. 11:06 నుండి మ. 12:38 వరకు, దుర్ముహూర్తం, ఉ. 10:11 నుండి ఉ. 11:03 వరకు, మ. 3:22 నుండి సా. 4:14 వరకు, రాహుకాలం, మ. 1:58 నుండి మ. 3:36 వరకు, యమగండం, తె. 5:51 నుండి ఉ. 7:29 వరకు, గుళికాకాలం, ఉ. 9:06 నుండి ఉ. 10:43 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:15 నుండి తె. 5:03 వరకు, అమృత ఘడియలు, ఉ. 8:02 నుండి ఉ. 9:34 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana

## దలాల్ స్ట్రీట్ దడేల్!

### స్టాక్ మార్కెట్ పాతాళానికి.. రూ.4 లక్షల కోట్లు ఆవిరి



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా పతనమయ్యాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలు, బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, కొత్తగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ తీవ్రంగా దెబ్బతింది.

› 2

## బంగారం ధర కుదేల్!

### హైదరాబాద్‌లో రూ.2,130 క్షీణత



అంతర్జాతీయంగా పరిణామాలు ప్రతికూలంగా ఉండటం, అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు బుధవారం గణనీయంగా తగ్గాయి.

› 2

## పెట్రో ధర భగభగల్!

### 75 డాలర్లకు చేరిన బ్యారెల్



అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇక ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ఇవాళ చమురు ధరలు ఆరు శాతానికిపైగా ఎగబాకాయి.

› 2




## మీసేవలో యూరియా బుకింగ్

హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): రాష్ట్రంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇకపై మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుక్ చేసుకునే విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. యాప్ లేకున్నా యూరియా బుకింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించింది. పీపీబీ నంబర్‌తో మీసేవల బుకింగ్ చేసుకోవచ్చని సూచించింది. ఓటీపీ ధ్రువీకరణతో వెంటనే బుకింగ్ ఐడీ వస్తుందని పేర్కొంది. ఈ బుకింగ్ ఐడీ 48 గంటలపాటు చెల్లుబాటు అయ్యే విధంగా ఉంటుందని తెలిపింది. ఎంపిక చేసిన డీలర్ వద్ద యూరియా కొనుగోలు తప్పనిసరి అని స్పష్టం చేసింది. మీసేవ

- తరువాయి 2 వ పేజీలో...

## బాకీల కార్డుకు గిరాకీ!





### దేశంలో భారీగా పెరిగిన క్రెడిట్ కార్డుల వినియోగం

పదేళ్లలో మూడింతలు.. వాడకంలో యువతే ముందంజ

పల్లెలకూ పాకిన వాడకం.. వ్యక్తిగత రుణాలూ భారీగానే

2026లో 3.1 లక్షల కోట్లకు క్రెడిట్ కార్డు బకాయిలు

జెన్ జెడ్ తరంలో ఇతర రుణ సేవల వినియోగం అధికం

భారత్‌లో క్రెడిట్ కార్డుల మార్కెట్ గత పదేళ్లలో మూడు రెట్లకుపైగా విస్తరించినట్లు ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తాజా నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా తొలిసారి క్రెడిట్ కార్డు తీసుకుంటున్న వినియోగదారుల్లో యువత శాతం గణనీయంగా పెరిగిందని, అలాగే పట్టణాలతో పాటు సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రెడిట్ కార్డుల వినియోగం విస్తరిస్తోందని పేర్కొంది.

న్యూఢిల్లీ: భారత్‌లో క్రెడిట్ కార్డుల మార్కెట్ గత పదేళ్లలో మూడు రెట్లకుపైగా విస్తరించినట్లు ట్రాన్స్ యూనియన్ సిబిల్ తాజా నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా తొలిసారి క్రెడిట్ కార్డు తీసుకుంటున్న వినియోగదారుల్లో యువత శాతం గణనీయంగా పెరిగిందని, అలాగే పట్టణాలతో పాటు సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రెడిట్ కార్డుల వినియోగం విస్తరిస్తోందని పేర్కొంది. అయితే దేశంలో క్రెడిట్ యాక్టివ్ వినియోగదారుల్లో కేవలం 25 శాతం మందికే క్రెడిట్ కార్డులు ఉండటం వల్ల ఈ రంగంలో ఇంకా భారీ వృద్ధికి అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది. 2026 మార్చి నాటికి తొలిసారి క్రెడిట్ కార్డు తీసుకున్న వినియోగదారుల్లో 30 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారి వాటా 50 శాతానికి చేరుకుంది. 2022 మార్చిలో ఇది 43 శాతంగా ఉండేది. అదే విధంగా సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్త కార్డుదారుల వాటా 42 శాతం నుంచి 46 శాతానికి పెరిగింది. కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకుంటున్న వారిలో చాలామంది ఇప్పటికే ఇతర రుణ ఉత్పత్తులను వినియోగిస్తున్నారని నివేదిక తెలిపింది. వీరిలో 25 శాతం మంది ఇప్పటికే మూడు లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ ఉత్పత్తులను కలిగి ఉన్నారు. అంటే చాలా మందికి క్రెడిట్ కార్డు తొలి రుణ సాధనం కాకుండా ఇప్పటికే ఉన్న క్రెడిట్ పోర్ట్‌ఫోలియోలో మరో సేవగా చేరుతోంది. అంతర్జాతీయంగా

- తరువాయి 2 వ పేజీలో...

## ఆస్ట్రేలియాలో మోదీకి ఘన స్వాగతం

### 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన మెల్‌బోర్న్



మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ఆస్ట్రేలియా చేరుకున్నారు. ఆయనకు మెల్‌బోర్న్ విమానాశ్రయంలో అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం లభించింది. ఆస్ట్రేలియాలోని భారత సంతతి ప్రజలు, ప్రవాస భారతీయులు ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం పలికారు.

› 2


## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,313 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,822 |

## విశ్వవాణి



అఫ్గానిస్థాన్‌లోని పక్తికా ప్రావిన్స్‌కు చెందిన మియా ఖాన్.. తనకు చదవడం, రాయడం రాకపోయినా, తన ముగ్గురు కుమార్తెలు చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన కలలు కంటున్నారు. ఇందుకోసం ప్రతిరోజూ 12 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు తీసుకెళ్తారు. అంతటితో ఆగకుండా, వారు పాఠాలు పూర్తిచేసే వరకు పాఠశాల బయటే గంటల తరబడి వేచి ఉండి, మళ్లీ వారిని సురక్షితంగా ఇంటికి తీసుకొస్తున్నారు. 'మా పట్టణంలో ఒక్క మహిళా వైద్యురాలు కూడా లేదు. నా కుమార్తె రోజాయ్ మా ప్రాంతంలోని తొలి మహిళా డాక్టర్‌గా మారడమే నా జీవితంలోని అతిపెద్ద కోరిక' అని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు.

## ఈ కాంగ్రెస్ కొడుకులకు చుక్కలే!

### మేం వచ్చినంక ఒక్క బిల్లూ ఇయ్యం

### మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు



మన ఊరు-మన బడిలో స్కూల్ కడితే రేవంత్ రెడ్డి వచ్చి ఇప్పటిదాకా బిల్లులు ఇస్తలేడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. ఎస్‌డీఎఫ్‌లో ఊరిలో పనిచేస్తే బిల్లు రాకపోతే ఏం పద్ధతి ఇది.. రేపు మనం కూడా ఊరుకుంటమా..? రేపు కాంగ్రెస్ పోయి మనం వస్తం. కాంగ్రెసోని బిల్లు ఒక్కటి కూడా ఇచ్చేది లేదన్నారు.

అందోల్, జూలై 8 (ఈవార్తలు): అందోల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎవరెవరైతే కాంగ్రెసోళ్లు ఇప్పుడు గుత్త పట్టుకుని పనిచేస్తున్నరు కదా.. ఆ కొడుకులకు చుక్కలు చూపించుడే.. ఇప్పుడు నర్సింలు అన్న ఎంత బాధపడ్డడో రేపు వాళ్లకు అంతకంటే ఎక్కువ తిప్పలు కావాలే అన్నారు. మా నర్సింలు అన్నకు మాత్రం బిల్లు మిత్తీతోని ఇప్పిస్తం. ఒక్క నర్సింలు అన్నకు మాత్రమే కాదు ఏ బీఆర్ఎస్ కార్యకర్తలైతే ఇప్పుడు బిల్లులు రాక బాధపడుతున్నరో.. మన గవర్నమెంట్ వచ్చిన మొదటి నెలలో మొదటి బిల్లు మీకే ఇస్తం' అని స్పష్టం చేశారు. ఇప్పుడు ఎవరెవరు కాంగ్రెసోళ్లు ఎగిరెగిరి పనులు చేస్తున్నరో చుక్కలు చూస్తరు బిడ్డా మీరు.. మావోళ్లను తిప్పల పెట్టినప్పుడు

- తరువాయి 2 వ పేజీలో...

## ఇరాన్‌కు నిద్రలేని రాత్రులే!

### ఆ దేశంలో సీజ్ ఫైర్ ముగిసింది

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్

### చర్చలు టైమ్ వేస్ట్ అన్న అగ్రరాజ్యాధినేత




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌తో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం (సీజ్ ఫైర్) ముగిసినట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. ఇవాళ రాత్రి ఇరాన్ మీద భారీ దాడి చేస్తామంటూ సంచలన ప్రకటన చేశారు.

ఇస్తాంబుల్: సీజ్ ఫైర్ ముగిసినట్లు ప్రకటించిన గంటల వ్యవధిలోనే.. ఇరాన్ మీద భారీ దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరించారు. టర్కీలో జరుగుతున్న నాటో సదస్సులో డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ మీద భీకర దాడులు ఉంటాయంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌కు చెందిన మరిన్ని నౌకలతో పాటుగా.. అవసరమైతే ఆ దేశంలోని విద్యుత్ గ్రిడ్, నీటి సదుపాయాలను కూడా అమెరికా సైన్యం టార్గెట్ చేస్తుందని ట్రంప్ ప్రకటించారు. అయితే పరిస్థితి అంతవరకూ వస్తుందని తాను అనుకోవడం లేదని తెలిపారు. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు ఎక్కువగా జరిగే ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ఆలోచనలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఇరాన్‌తో ఇక ఒప్పందం చేసుకోమని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. తన దృష్టిలో అంతా ముగిసిపోయిందని..

- తరువాయి 3 వ పేజీలో...

## నీట్-2027..సీబీటీ!

### భారీగా తగ్గనున్న పరీక్ష కేంద్రాలు.. కీలక మార్పుల దిశగా ఎన్టీయే చర్యలు



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగబోయే నీట్ యూజీ 2027కు సంబంధించి కీలక మార్పులు జరగబోతున్నాయి. ఈ మేరకు నీట్ పరీక్ష నిర్వహించే 'ద నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే)' కొన్ని మార్పులు తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జరిగినట్లు లీకేజీలు జరగకుండా, విమర్శలకు తావులేకుండా ఈ పరీక్ష నిర్వహించాలని ఎన్టీయే లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని నివేదికల సమాచారం ప్రకారం.. వచ్చే ఏడాది పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా జరగనుంది. అంటే పూర్తిగా కంప్యూటర్‌పైనే పరీక్ష నిర్వహిస్తారు. ఇలా నీట్ పరీక్ష నిర్వహించనుండటం ఇదే మొదటిసారి. అలాగే, ఇప్పట్లోలాగే ఒకేరోజు పరీక్ష కాకుండా

- తరువాయి 3 వ పేజీలో...

## దేశంలో కోటి మంది టీచర్లు

### 1.02 కోట్లకు చేరిన ఉపాధ్యాయులు.. దేశవ్యాప్తంగా మొత్తం 14 లక్షల స్కూళ్లు

### అందులో 24 మంది విద్యార్థులు.. కేంద్ర 2025-26 నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో 1.02 కోట్ల మంది టీచర్లు, 14.66 లక్షల స్కూళ్లు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు దేశంలోని స్కూళ్లకు సంబంధించి యూడీఐఎస్‌ఈం (యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) 2025-26 రిపోర్టును కేంద్ర విద్యాశాఖ తాజాగా వెల్లడించింది. దేశంలోని స్కూల్స్, టీచర్లు, విద్యార్థుల సంఖ్య, డ్రాపౌట్లు వంటి అంశాల్ని ఈ నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2025-26 విద్యా సంవత్సరంలో 1.02 కోట్ల (1,02,73,020) మంది టీచర్లున్నారు. అలాగే 14.66 లక్షల స్కూళ్లు (14,66,682) పనిచేస్తుండగా, 24.72

- తరువాయి 3 వ పేజీలో...



## భారత ట్యాంకర్ వెనక్కి!

### రంగంలోకి కేంద్ర ప్రభుత్వం

పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ పరస్పర సైనిక దాడులతో వ్యూహాత్మక హోర్మూజ్ జలసంధిలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన ఒమన్ కారిడార్ గుండా ప్రయాణిస్తున్న ఓ భారత చమురు ట్యాంకర్‌ను ఇరాన్ భద్రతా దళాలు అడ్డుకుని, వెనక్కి పంపించినట్లు తెలుస్తోంది.

› 2

## రాశి ఫలాలు

9-7-2026

**మేషం:** వృత్తి, వ్యాపారాలలో అనుకూలమైన మార్పులు చూస్తారు. అనుకున్న పనులు సకాలంలో పూర్తవుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండి, మొండిబాకీలు వసూలవుతాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు మరియు ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది.

**వృషభం:** కార్యాలయాలలో పని ఒత్తిడి కొద్దిగా పెరిగే అవకాశం ఉంది కాబట్టి సహోద్యోగులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. అనవసరపు ఖర్చులను తగ్గించుకుని పొదుపుపై దృష్టి పెట్టడం అవసరం. మానసిక ప్రశాంతత కోసం కొంత సమయం కేటాయించండి. కుటుంబంలో సామాన్య వాతావరణం ఉంటుంది.

**మిధునం:** నూతన పరిచయాలు వ్యాపార విస్తరణకు తోడ్పడతాయి మరియు ఉద్యోగంలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఆకస్మిక ధనలాభం కలిగే సూచనలు ఉన్నాయి. పెట్టుబడులకు ఇది అనుకూలమైన రోజు. ఇరుగుపొరుగు వారితో సఖ్యత పెరుగుతుంది.

**కర్కాటకం:** శ్రమకు తగిన ప్రతిఫలం ఆలస్యంగానైనా లభిస్తుంది. పట్టుదలతో పనులను పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలు చేసేటప్పుడు కాస్త అప్రమత్తంగా ఉండాలి. ఎవరికీ పెద్ద మొత్తంలో అప్పులు ఇవ్వవద్దు. జీవిత భాగస్వామి సలహాలు కలిసివస్తాయి. ఉదర సంబంధిత సమస్యల పట్ల జాగ్రత్త అవసరం.

**సింహం:** మీ నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తాయి మరియు వ్యాపార రంగంలోని వారికి ఆశించిన లాభాలు అందుతాయి. పాత బాకీలు తీరిపోతాయి. విలాసవంతమైన వస్తువుల కొనుగోలుకై ఖర్చు చేస్తారు. గృహంలో ఒక శుభకార్య చర్చ జరుగుతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు.

**కన్య:** ఉద్యోగంలో అధికారుల మద్దతు లభిస్తుంది మరియు చేపట్టిన పనుల్లో ఉన్న అడ్డంకులు తొలగిపోతాయి. మిత్రుల సహాయంతో ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు వింటారు. ఆరోగ్యం బాగుంటుంది.

**తుల:** ప్రయాణాలు కలిసివస్తాయి. నూతన ప్రాజెక్టులు ప్రారంభించడానికి అనుకూలమైన సమయం. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. భూ లేదా వాహన యోగం సూచిస్తోంది. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది, అయితే ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** పోటీ వాతావరణం ఉన్నప్పటికీ మీదే పైచేయి అవుతుంది, కాబట్టి సహనంతో వ్యవహరించడం ముఖ్యం. మిశ్రమ ఫలితాలు ఉంటాయి. రావాల్సిన డబ్బు చేతికి అందడంలో కొంత ఆలస్యం కావచ్చు. పిల్లల చదువుల విషయంలో శుభవార్తలు వింటారు. కంటి సంబంధిత చిన్నపాటి సమస్యలు ఉండవచ్చు.

**ధనస్సు:** ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. పని విషయంలో కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఖర్చులు పెరిగినప్పటికీ దానికి తగ్గ ఆదాయం కూడా సమకూరుతుంది. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన పెరుగుతుంది మరియు మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**మకరం:** గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభమవుతాయి. వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. ఆస్తి తగాదాలు నూతన ఒప్పందాలతో పరిష్కారమవుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. పాత మిత్రులను కలుసుకుంటారు. ఆరోగ్య విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

**కుంభం:** సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి మరియు నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అనుకోని మార్గాల ద్వారా ధనప్రాప్తి కలుగుతుంది. పొదుపు పథకాలలో పెట్టుబడి పెడతారు. జీవిత భాగస్వామితో ఉన్న మనస్పర్థలు తొలగిపోయి రోజంతా ఉల్లాసంగా గడుస్తుంది.

**మీనం:** పనులలో కొంత ఆలస్యం జరిగినా చివరకు విజయం సాధిస్తారు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. అవసరానికి తగినట్లుగా డబ్బు అందుతుంది కానీ అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. బంధువులతో చిన్నపాటి విభేదాలు వచ్చే సూచనలు ఉన్నాయి. మాట్లాడేటప్పుడు జాగ్రత్త వహించండి.

# ఈ కాంగ్రెస్ కొడుకులకు చుక్కలే!

(మొదటి పేజీ తరువాయి)

మిమ్మల్ని విడిచిపెడ్తమా..? మేము.. మీ సంగతి కూడా చెప్తం బరాబర్.. అని హరీశ్ రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజాసంక్షేమం కోసం పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తే.. కాంగ్రెస్ ప్రజాపాలనలో పథకాలను స్కామ్‌లు చేస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బీఆర్ఎస్ పార్టీకి చెందిన వాళ్ల ఓట్లను తొలగించేందుకు కుట్రలను చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును పొందాలంటే ఎస్ఐఆర్ ఫామ్‌లను తప్పనిసరిగా నింపేలా బీఎల్ఏలు శ్రమించాలన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తయిన తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు ఉంటుందని ఆయన తెలిపారు. రైతులకు మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలని చెప్పిన రెవంత్‌రెడ్డి గడిచిన రెండున్నర ఏండ్ల పాలనలో రూ.19 వేల కోట్లను ఎగ్గొట్టారని ఆయన విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వకుండా, వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. గొర్రెలు, చేపల పంపిణీ ఊసేలేదని, దళిత బంధు రూ.12 లక్షలు ఏమైందని ఆయన ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్‌ల ద్వారా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గురుకులాలు, విద్యుత్, బొగ్గు, సివిల్ సప్లయ్‌లతో పాటు ఇతరత్రా సంస్థలలో అనేక స్కామ్‌లు జరగాయన్నారు.

### అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారే తప్ప..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని మాటా తప్పి ఇందిరమ్మ పరువు తీస్తున్నారని, ఈ పథకానికి రెవంత్ ఆత్మీయ భరోసాగా మార్చుకుంటే బాగుంటుందని ఆయన ఎద్దేవా చేశారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని వివిధ సందర్భాలలో రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల దేవతల మీద ప్రమాణం చేసి మాటా తప్పి రైతులను నిలువునా మోసం చేశారన్నారు. కల్యాణ లక్ష్మి డబ్బులు పెళ్లి జరిగిన నెలలోపు రావాల్సి ఉండగా, వారికి పిల్లలు పుట్టాక వస్తున్నాయన్నారు. సకాలంలో సరిపడ యూరియా ఇవ్వడం లేదని, రైతు పంటలకు భీమాను కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారే తప్ప ఇప్పటికి అమలు చేయలేదన్నారు. డిల్లీకి కట్టల బ్యాగులు మోయడం తప్ప మరోపని రెవంత్‌రెడ్డికి లేదన్నారు.

### త్వరలో పాదయాత్ర చేస్తా

బస్వవేశ్వర-సంగమేశ్వర ప్రాజెక్టు సాధన కోసం త్వరలో పాదయాత్రను చేపట్టేందుకు సిద్దంగా ఉన్నానని, నావెంట నడిచే వాళ్లు సిద్దంగా ఉండాలని హరీష్‌రావు అన్నారు. సింగూరు కాలువల ద్వారా ప్రస్తుతం అందోలు, పుల్కల్ మండలాలకు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, బస్వవేశ్వర-సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే అందోలు నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. నారాయణఖేడ్‌లోని బోరంచ అమ్మవారి నుంచి జహిరాబాద్‌లోని రెజింతల్‌లో సిద్దివినాయక అలయంలో పూజలు చేసి కాంగ్రేసోళ్లకు జ్ఞానోదయం కలగాలని మొక్కుదామన్నారు. బస్వవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టు పనులను ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామన్నారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మత్తులు నత్తనడకన సాగుతున్నాయని, రైతులకు క్రాఫ్ హాలీడే ప్రకటించి, ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

### రేవంత్, ఉత్తమ్‌ను ఉరి తీయాలి

సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి పదేపదే కేసీఆర్ అంటూ మాట్లాడుతున్నాడు.. ఈ సందర్భంగా ఆయనకు నేను ఒక్క విషయం చెప్పదలుచుకున్నా.. రేవంత్ నీకు కేసీఆర్ అవసరం లేదు.. నేను చాలు. ఒక్క మూడు నెలలు నాకు ఇరిగేషన్ శాఖ అప్పగించు.. నీళ్లు ఎలా తేవాలో నేను చూపిస్తా అంటూ హరీశ్ రావు సవాల్ చేశారు. పొట్టిగా ఉన్నోనికి.. పొడుగోన్ని చూస్తే జెలసీ ఉంటుంది. నీకు మెదడు లేదు రేవంత్ అంటూ హరీశ్ రావు విమర్శించారు. నేను తాటిచెట్టులాగా పెరిగాను అంటున్నాడు.. దానికి నేను ఉమి చెయ్యాలి.. దేవుడు నిన్ను ఇప్ప చెట్టులాగా పొట్టిగా పుట్టించాడు. ఎల్‌నినో వచ్చింది.. నీళ్లులేవు, వర్షాలు లేవు. మోటార్లు ఎక్కడ ఆన్ చెయాలి అని రేవంత్ అంటుండు.. మేడిగడ్డ దగ్గర 89వేల 230 క్యూసెక్కుల నీళ్లు ఈ క్షణానికి ప్రవహిస్తున్నాయి. వానపడ్డా.. పడకున్నా.. మేడిగడ్డ దగ్గర నీళ్లు ఉంటాయి. అందుకే కేసీఆర్ అక్కడ ప్రాజెక్టు కట్టిండు. తెలంగాణ కోసం నీళ్లను ఒడిసి పట్టకుండా.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం, ఆంధ్రా కోసం రేవంత్ రెడ్డి నీళ్లు వదిలిపెడుతున్నాడు. నీళ్లు ఉన్నాయి.. నీళ్లు లేవంటున్న రేవంత్.. మరి ఇప్పుడు నీ తలకాయ ఎక్కడ పెట్టుకుంటావు అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు. రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఉరివేసినా తప్పులేదు. నదులల్లో నీళ్లు పుష్కలంగా ప్రవహిస్తున్న.. నీళ్లుండి మోటార్లు నడపకపోవడం ఏమనాలి అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు. నీళ్ల మంత్రిగా ఉత్తమ్, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఇద్దరూ ఫెయిల్ అయ్యారు. దేవాదుల దగ్గర మోటార్లను ఎందుకు ఆన్ చేయడం లేదు..? ఇక్కడ ఎన్డీఎస్ఏ ఇంకా వేరే అభ్యంతరాలు లేవు కదా రేవంత్? కట్టిన ఇళ్ళు.. పెట్టిన పొయ్యిలాగా కేసీఆర్ అన్నీ చేశాడు.. అయినా కాంగ్రెస్ ఏమీ చేయట్లేదు. రేవంత్ నువ్వు నిన్న చెప్పిన ప్రతి ఒక్కొక్క అబద్ధానికి.. ఒక్కొక్క అక్షరానికి సమాధానం చెబుతా ఆధారాలతో సహా బయటపెడుతా అని హరీశ్ రావు అన్నారు. తుమ్మడిహట్టి వద్ద అన్ని అనుమతులు కాంగ్రెస్ తెచ్చింది అంటున్న రేవంత్ రెడ్డి.. అనుమతి కాఫీని బయట పెట్టాలి. తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు మహారాష్ట్ర ఒప్పుకున్నట్టు డాక్యుమెంట్ ఉంటే బయట పెట్టు రేవంత్.. నేను రాజీనామా చేస్తా అంటూ హరీశ్ రావు సవాల్ చేశారు. అనుమతి కాఫీ లేదంటే బయటకు వచ్చి తప్పయిందని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పు.. రాజకీయాలకోసం మాట్లాడాను అని ఒప్పుకో. మీరు అనుమతులు తెస్తే 2013లో మహారాష్ట్ర సీఎం పద్నవీస్ అనుమతి ఇవ్వమని లేఖ ఎందుకు రాశారు? సీఎం రేవంత్ రెడ్డి తెలివి తక్కువ మాటలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అంటే కరెక్షన్... కరెప్షన్ అంటే కాంగ్రెస్ అంటూ హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# భారత ట్యాంకర్ వెనక్కి!

## రంగంలోకి కేంద్ర ప్రభుత్వం

టెహ్రాన్/న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ పరస్పర సైనిక దాడులతో వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన ఒమన్ కారిడార్ గుండా ప్రయాణిస్తున్న ఓ భారత చమురు ట్యాంకర్‌ను ఇరాన్ భద్రతా దళాలు అడ్డుకుని, వెనక్కి పంపించినట్లు తెలుస్తోంది. అమెరికా పర్యవేక్షణలో సాగుతున్న ఒమన్ తాత్కాలిక కారిడార్‌ను కాకుండా, హోర్ముజ్ జలసంధిలో తాము నిర్దేశించిన మార్గంలోనే వెళ్లాలంటూ ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకలను హెచ్చరిస్తుండటం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. గల్ఫ్ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన వివిధ దేశాల వాణిజ్య నౌకలు వాటి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేందుకు వీలుగా ఒమన్ ప్రభుత్వం, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సముద్రయాన సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించాయి. ఒమన్ తీరం వెంబడి వెళ్లేలా అమెరికా భద్రతా పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక కారిడార్‌నే ప్రస్తుతం నౌకలు ఉపయోగిస్తున్నాయి. అయితే, ఈ మార్గంపై ఇరాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తాము సూచించిన హోర్ముజ్ మార్గాన్నే వినియోగించుకోవాలని నౌకలకు గట్టి హెచ్చరికలు జారీ చేస్తోంది. జలసంధి దిగ్బంధనం కావడంతో ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోనే తొమ్మిది భారతీయ చమురు ట్యాంకర్లు చిక్కుకుపోయాయి. వీటిలో పూర్తి స్థాయిలో ముడిచమురు, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ లోడ్ అయి ఉన్నట్లు సమాచారం. ఈ నౌకల్లో సుమారు 198 మంది భారతీయ నావికులు కూడా ఉన్నారు. గత కొన్ని నెలలుగా హోర్ముజ్ జలసంధి మూతపడటంతో వందలాది మంది నావికులు ఇక్కడే చిక్కుకుపోగా, తాజాగా యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో వీరి రక్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్ నెలలో జరిగిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడంతో భారత్ మరింత అప్రమత్తమైంది. తాజా పరిస్థితులను, భారత నౌకల కదలికలను మోదీ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. నిలిచిపోయిన తొమ్మిది చమురు ట్యాంకర్లకు మార్గాన్ని సుగమం చేయడంతో పాటు, 198 మంది భారతీయ నావికులను క్షేమంగా తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకోసం ఇరాన్ ఉన్నతాధికారులతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు ఉన్న అన్ని దౌత్యపరమైన అవకాశాలను విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# దలాల్ స్ట్రీట్ దడేల్!

### స్టాక్ మార్కెట్ పాతాళానికి

**రూ.4 లక్షల కోట్లు ఆవిరి**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా పతనమయ్యాయి. పెరుగుతున్న ముడిచమురు ధరలు, బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, కొత్తగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు రెండు శాతానికి పైగా పతనమయ్యాయి. ఇవాల్టి ట్రేడింగ్ రెండో సెషన్‌లో మార్కెట్ల పతనం మరింత వేగవంతమైంది. ఇరాన్‌తో తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం 'ముగిసిపోయింది' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో అమ్మకాల సునామీ వచ్చింది. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతాయనే ఆందోళనలు, ప్రపంచ ఇంధన సరఫరాలపై దాని ప్రభావం గురించిన భయాలు ఇన్వెస్టర్లను అమ్మకాలవైపు నడిపించాయి. మధ్యాహ్నం ట్రేడింగ్‌లో నిఫ్టీ దాదాపు 500 పాయింట్లు పడిపోగా, సెన్సెక్స్ 1,600 పాయింట్లకుపైగా నష్టపోయింది. దాదాపు అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ 50లోని 50 కంపెనీలకుగాను 45 నష్టాల్లో ట్రేడయ్యాయి. ఈ తీవ్రమైన నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.4 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.476 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. అంతకుముందు ఉదయం సెషన్‌లోనే మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 364 పాయింట్ల నష్టంతో 77,816 వద్ద, నిఫ్టీ 139 పాయింట్ల నష్టంతో 24,259 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఆయిల్ ఌ గ్యాస్ సూచీ అత్యధికంగా నష్టపోయింది. వీటితోపాటు మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, మెటల్, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా నష్టాలను చవిచూశాయి.

# బాకీల కార్డుకు గిరాకీ!

(మొదటి పేజీ తరువాయి)

పోలిస్తే భారత్‌లో క్రెడిట్ కార్డుల వినియోగం ఇంకా తక్కువగానే ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో క్రెడిట్ కార్డు వినియోగం 70 శాతం, కొలంబియాలో 62 శాతం, హాంకాంగ్‌లో 98 శాతంగా ఉండగా, భారత్‌లో అది కేవలం 25 శాతమే. 2016 మార్చి నుంచి 2026 మార్చి వరకు క్రెడిట్ కార్డు కలిగిన వినియోగదారుల సంఖ్య 1.4 కోట్ల నుంచి 5.2 కోట్లకు పెరిగింది. అదే సమయంలో యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 2.1 కోట్ల నుంచి 10.7 కోట్లకు చేరుకుంది. క్రెడిట్ కార్డులపై బకాయిల మొత్తం రూ.0.4 లక్షల కోట్ల నుంచి రూ.3.1 లక్షల కోట్లకు పెరగడం ఈ రంగంలో వేగవంతమైన విస్తరణకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం వినియోగదారులు క్రెడిట్ కార్డులతో పాటు చిన్న మొత్తాల వ్యక్తిగత రుణాలు, వినియోగ వస్తువుల రుణాలు వంటి పలు రకాల క్రెడిట్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ ఎండీ, సీఈఓ భావేశ్ జైన్ తెలిపారు. దీంతో దేశంలో అధికారిక రుణ వ్యవస్థ మరింత విస్తరిస్తోందని ఆయన అన్నారు. జెన్-జెడ్ తరం వినియోగదారులు క్రెడిట్ కార్డు తీసుకునే సమయానికే ఇతర రుణ సేవలను వినియోగిస్తున్నారని నివేదిక వెల్లడించింది. 2024లో మొదటిసారి క్రెడిట్ కార్డు పొందిన జెన్-జెడ్ వినియోగదారుల్లో 18 శాతం మంది ఇప్పటికే కన్స్యూమర్ డ్యూరబుల్ లోన్, 23 శాతం మంది చిన్న మొత్తాల వ్యక్తిగత రుణాలను కలిగి ఉన్నట్లు పేర్కొంది.

**కార్డు వినియోగం - దేశాల వారీగా**

| దేశం | వినియోగం |
|---|---|
| హాంకాంగ్ | 98% |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 70% |
| కొలంబియా | 62% |
| భారత్ | 25% |

**క్రెడిట్ కార్డు వినియోగదారులు**

2016: 1.4 కోట్లు

2026: 5.2 కోట్లు (3.6 రెట్లు వృద్ధి)

**యాక్టివ్ క్రెడిట్ కార్డులు**

2016: 2.1 కోట్లు

2026: 10.7 కోట్లు (5 రెట్లు వృద్ధి)

**క్రెడిట్ కార్డు బకాయిలు**

2016: రూ.0.4 లక్షల కోట్లు

2026: రూ.3.1 లక్షల కోట్లు

(8.3 రెట్లు పెరుగుదల)

**30 ఏళ్లలోపు కొత్త కార్డుదారులు**

2022: 43%.. 2026: 50%

**సెమీ అర్బన్ గ్రామీణ ప్రాంతాల కొత్త కార్డుదారులు**

2022: 42%.. 2026: 46%

**జెన్-జెడ్ ధోరణి ఇలా..**

క్రెడిట్ అనుభవం లేకుండానే కార్డు తీసుకున్నవారు - 30%

మొదటి కార్డు తీసుకునే సమయానికే కన్స్యూమర్ డ్యూరబుల్ లోన్ ఉన్నవారు - 18%

చిన్న మొత్తాల వ్యక్తిగత రుణం ఉన్నవారు - 23%

# ఆస్ట్రేలియాలో మోదీకి ఘన స్వాగతం

### 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన మెల్‌బోర్న్

మెల్‌బోర్న్: మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ఆస్ట్రేలియా చేరుకున్నారు. ఆయనకు మెల్‌బోర్న్ విమానాశ్రయంలో అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం లభించింది. ఆస్ట్రేలియాలోని భారత సంతతి ప్రజలు, ప్రవాస భారతీయులు ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై', 'మోదీ.. మోదీ' నినాదాలతో విమానాశ్రయ పరిసరాలు హోరెత్తాయి. 'ఆస్ట్రేలియన్ ఇండియన్ ఆర్కెస్ట్రా' అందించిన వందేమాతరం ఆలాపన ఈ స్వాగత వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండోనేషియా పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియా వచ్చిన ప్రధాని మోదీ, ఈ పర్యటన అనంతరం న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో జరగబోయే ద్వైపాక్షిక చర్చలు ఇరు దేశాల 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో స్పందిస్తూ... 'ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో చర్చల కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇరు దేశాల బంధానికి బలమైన స్తంభాలుగా నిలుస్తున్న ప్రవాస భారతీయులతో ముచ్చటించే అవకాశం కూడా ఈ పర్యటనలో నాకు లభించనుంది.' అన్నారు. ఈ ఉన్నత స్థాయి భేటీలో ఇరు దేశాల ప్రధానమంత్రులు రక్షణ-భద్రత, వ్యాపారం-పెట్టుబడులు, విద్య, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలతో పాటు అభివృద్ధి చెందుతున్న కీలక సాంకేతికతలు, క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్ రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

# మీసేవలో యూరియా బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)

సేవా రుసుము కేవలం రూ.10గా నిర్ణయించినట్లు వివరించింది. యాప్ లేదా మీసేవ ద్వారానే అధికారిక బుకింగ్ ఉంటుందని స్పష్టం చేసింది. అందుకు యాక్టివ్ మొబైల్ నంబర్ తప్పనిసరి అని పేర్కొంది. ఏమైనా సందేహాల ఉంటే ఏఈవో, ఎమ్ఏఓ లేదా మీసేవ కేంద్రాన్ని సంప్రదించాలని రైతులకు ప్రభుత్వం సూచించింది.


# బంగారం ధర కుదేల్!

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పరిణామాలు ప్రతికూలంగా ఉండటం, అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు బుధవారం గణనీయంగా తగ్గాయి. ఢిల్లీలో స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ. 800 తగ్గి రూ.1,48,450కు చేరగా, వెండి కిలోకు రూ.2,39,800 వద్ద స్థిరంగా కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ కూడా 1.2 శాతం పడిపోయి ఔన్సుకు 4,056.24 డాలర్ల వద్ద ట్రేడయింది. పెరుగుతున్న చమురు ధరలు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చనే సంకేతాలు ఉండటం, పెట్టుబడిదారులు బంగారం కంటే అమెరికా ట్రెజరీ బాండ్లు, డాలర్ వైపు మొగ్గు చూపుతున్నారని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు మళ్లీ ముదురుతున్నాయనే సంకేతాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, బుధవారం రాత్రి సమయానికి హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం రూ. 2,130 క్షీణించి రూ. 1,43,130 వద్ద ఉండగా, ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి పది గ్రాములు రూ. 1,950 తగ్గి రూ. 1,31,200గా ఉంది. వెండి ధరల్లో పెద్దగా మార్పులు లేకపోవడంతో కిలో 2.45 లక్షల వద్ద ఉంది.

# పెట్రో ధర భగభగల్!

## 75 డాలర్లకు చేరిన బ్యారెల్

న్యూఢిల్లీ: అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇక ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ఇవాళ చమురు ధరలు ఆరు శాతానికిపైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది.




అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడయ్యింది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళు ,, అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది.

## ఇరాన్‌కు నిద్రలేని రాత్రులే!

(మొదటి పేజీ తరువాయి)

చర్చలతో టైమ్ వేస్ట్ తప్ప ప్రయోజనం శూన్యమంటూ ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఖమేనీ అంత్యక్రియలు చేసుకోమని చెప్తే.. నౌకలపై దాడులు చేశారని.. అందుకే గత రాత్రి తీవ్రమైన దాడులు చేసినట్లు ట్రంప్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మరోవైపు హర్మూజ్ జలసంధిలో వెళ్తున్న మూడు నౌకలపై ఇరాన్ దాడులు చేయగా.. ఇందుకు బదులుగా అమెరికా సైన్యం ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, తీర ప్రాంత నిఘా వ్యవస్థపై ఎయిర్ ఫోర్స్ సాయంతో వైమానిక దాడులు చేసింది. దీంతో సీజ్ ఫైర్ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఆరోపిస్తూ కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణిదాడులు చేసింది. ఈ పరిణామాల మధ్య ఇరాన్‌తో ఇక ఒప్పందం ఉండదని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారీ దాడి చేస్తామంటూ వార్నింగ్ ఇచ్చారు.

## నీట్-2027..సీబీటీ!

(మొదటి పేజీ తరువాయి)

కనీసం ఐదు లేదా ఆరు రోజులపాటు పరీక్ష జరుగుతుంది. ఇటీవలి పరీక్షకు దాదాపు 23 లక్షల మంది హాజరయ్యారు. అందువల్ల ఐదు రోజులపాటు పరీక్ష నిర్వహిస్తే.. రోజుకు ఐదు లక్షల మంది వరకు హాజరవుతారు. పరీక్షా కేంద్రాలను కూడా తగ్గిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5,000 కేంద్రాలలో పరీక్ష జరుగుతుంది. అయితే, ఇకపై 500 పట్టణాల్లో, 1,000 కేంద్రాలలో మాత్రమే పరీక్ష నిర్వహించాలని ఎన్టీయే భావిస్తోంది. అవి కూడా ఎక్కువ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఎగ్జామ్ నిర్వహించాలనే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వ విద్యాసంస్థలైన కేంద్రీయ విద్యాలయాలు, నవదోయ విద్యాలయాలు వంటి వాటిని వినియోగించుకుంటుంది. ప్రైవేటు సంస్థలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు అన్నింటిపై చర్చ జరుగుతోంది. వీటికి ప్రభుత్వ ఆమోదం లభిస్తే.. ఈ విధానంపై తుది నోటిఫికేషన్ వెలువడుతుంది. అంతేకాదు.. ఎన్టీయేలో వ్యవస్థాపక మార్పులకు కూడా సంస్థ సిద్ధమైంది. ఎన్టీయేలోకి 150 మంది సిబ్బందిని కూడా నియమించుకోబోతుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోపు నియామకపు ప్రక్రియ పూర్తికానుంది.

## దేశంలో కోటి మంది టీచర్లు

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల (24,72,19,766) మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో డ్రాపౌట్ శాతం తగ్గి, 1.8గా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో స్కూళ్లలో విద్యార్థుల డ్రాపౌట్ శాతం 2.3 శాతంగా ఉండేది. మరోవైపు టీచర్ల సంఖ్య కూడా పెరుగుతూ ఉంది. 2022-23లో 94.8 లక్షల మంది టీచర్లు పనిచేయగా, 2024-25లో 1.01 కోట్ల మంది టీచర్లు స్కూళ్లలో పని చేశారు. ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటడాన్ని దేశ పాఠశాలల చరిత్రలో గొప్ప విజయంగా కేంద్ర విద్యాశాఖ అభివర్ణించింది. కేంద్రం అమలు చేస్తున్న సమగ్ర శిక్ష, నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ద్వారా ఇది సాధ్యమైందని తెలిపింది. మరోవైపు పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య కూడా తగ్గినట్లు వివరించింది. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగినప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం మాత్రం తగ్గింది. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల్లో 12.1 కోట్ల మంది నమోదు చేసుకోగా, 2025-26లో 11.8 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య దాదాపు 30 లక్షలు పెరిగింది. దేశంలో సింగిల్ టీచర్ స్కూల్స్ 3 శాతం ఉన్నాయి. వీటిలో చాలావరకు విద్యార్థుల నమోదు శాతం సున్నాగా ఉంది. ఇలా ఒక్క విద్యార్థి లేని పాఠశాలల శాతం 2గా ఉంది.

తెలంగాణలో 70 శాతం మంది లెక్చరర్లకే అర్హతలు

తెలంగాణలో ఇంటర్మీడియట్ స్థాయిలో బోధిస్తున్న ఉపాధ్యాయుల్లో కేవలం 70 శాతం మందికే వృత్తిపరమైన అర్హతలు ఉన్నాయని నివేదిక నొక్కి చెప్పింది. ఈ విషయంలో తెలంగాణ పలు ప్రధాన రాష్ట్రాల కంటే వెనుకబడినట్లు నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం, ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుల అర్హతలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, విద్యా స్థాయి పెరిగే కొద్దీ వృత్తిపరమైన అర్హతలు కలిగిన ఉపాధ్యాయుల శాతం తగ్గుతోంది. 9, 10 తరగతుల (సెకండరీ) స్థాయిలో తెలంగాణలో 95.8 శాతం మంది ఉపాధ్యాయులు వృత్తిపరంగా అర్హత పొందారు. ఇందులో పురుష ఉపాధ్యాయులు 96.9 శాతం, మహిళా ఉపాధ్యాయులు 94.9 శాతం ఉన్నారు. అయితే 11, 12 తరగతుల (హయ్యర్ సెకండరీ) స్థాయిలో ఈ శాతం 70కు పడిపోయింది. ఇందులో పురుష ఉపాధ్యాయుల్లో కేవలం 64.3 శాతం, మహిళా ఉపాధ్యాయుల్లో 76.1 శాతం మందికే వృత్తిపరమైన అర్హతలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో 97.7 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 96.8 శాతం, మహారాష్ట్రలో 96.3 శాతం మంది ఉన్నత మాధ్యమిక ఉపాధ్యాయులు వృత్తిపరంగా అర్హత పొందినవారే. దీంతో తెలంగాణ ఈ విషయంలో గణనీయంగా వెనుకబడినట్లు నివేదిక స్పష్టం చేసింది.

## తెలంగాణ విఫలం కాదు.. సఫలం

**ప్రపంచ బ్యాంకు నివేదికపై కేటీఆర్ ఆనందం**

హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): 'తెలంగాణ దివాలా తీసింది' అంటూ దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు గట్టి కౌంటర్ పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచ బ్యాంకు' ఇచ్చిన తాజా నివేదికలో... తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ పేర్కొనడంపై కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే ఈ ఘనత సాధించిన టాప్-5 అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ నిలవడం మనకందరికీ గర్వకారణమంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పరోక్షంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దార్శనిక పాలన వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. పదేళ్ల కిందట వరకు దరిద్రం తాండవించిన ప్రాంతం కాస్తా... నేడు ధనిక రాష్ట్రంగా మారిందని అన్నారు. తెలంగాణ ప్రజలు బికారులు కాదని, సిరిసంపదలతో తులతూగే తెలంగాణ తల్లి బిడ్డలని వ్యాఖ్యానించారు. తమ చెమటను, నైపుణ్యాన్ని, మేధస్సును ధారపోసి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నామని చెప్పారు. "తెలంగాణ వస్తే ఏం పెరిగింది అని అడిగేవారు చూడాలి. ఇక్కడ జాతి సంపద పెరిగింది, జనం ఆదాయం అద్భుతంగా వృద్ధి చెందింది" అని కేటీఆర్ అన్నారు.

## లోగో పెట్టు.. రూ.లక్ష కొట్టు

హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం 'క్యూర్' పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎల్ఐజీ గృహ నిర్మాణ పథకానికి అధికారిక లోగో రూపకల్పన కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రజల నుండి ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఉత్తమ లోగోను డిజైన్ చేసిన విజేతకు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేయనున్నట్లు ప్రకటించింది. ఆసక్తి గల వారు తమ డిజైన్లను 2026, జూలై 12వ తేదీ లోపు సమర్పించాల్సి ఉంటుంది. హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ ఈ వివరాలను వెల్లడించారు. లోగో పోటీలో పాల్గొనాలనుకునే డిజైనర్లు, విద్యార్థులు, కళాకారులు, ఇతర సృజనకారులు తమ ఎంట్రీలను హౌసింగ్ బోర్డ్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేస్తే ఖబర్దార్

**కాంగ్రెస్ సర్కార్ పీఠాలు కూలుతయ్.. బీసీ సంఘాల నేతల హెచ్చరిక**



హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తోందని, బీసీలకు అన్యాయం చేయాలని ఉద్దేశంతోనే రాష్ట్ర హైకోర్టులో కనీసం అడ్వకేట్ జనరల్ హాజరు కాకుండా చూస్తోందని బీసీ సంఘాల నేతలు మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ సమస్య- భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ (బీసీ జేఏసీ చైర్మన్) బండారు దత్తాత్రేయ (హర్యానా మాజీ గవర్నర్), సిరికొండ మధుసూదనాచారి, ఎల్ రమణ (బీఆర్ఎస్) నెల్లికంటి సత్యం (సిపిఐ) నిజ్జన రమేష్ (టీజేఎస్) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఫీజు రియంబర్స్‌మెంట్ రద్దు చేసి కాంగ్రెస్ బీసీల ద్రోహానికి పాల్పడుతుందని, బీసీలకు అన్యాయం చేయాలని ఉద్దేశంతోనే రాష్ట్ర హైకోర్టులో ఫీజు రియంబర్స్‌మెంట్ కేసులో కనీసం అడ్వకేట్ జనరల్ హాజరు కాకుండా కావాలనే ఫీజుల రద్దుకు సంబంధించిన తీర్పు రావాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తలేదని ఈ విద్యా సంవత్సరం జరిగే ఇంజనీరింగ్ అడ్మిషన్లు ఉత్తీర్ణత అయిన 50వేల మంది బడుగు విద్యార్థులు ఇంజనీరింగ్ కౌన్సిల్ లో పాల్గొనలేదని ఆయన తెలిపారు, ఇటీవల ప్రపంచ బ్యాంక్ భారతదేశంలో మొదటి ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ అని ప్రకటిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఖజానా ఖాళీ అనడం వారి దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు, 9 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న ప్రభుత్వ స్పందించడం లేదని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల సత్తా ఏందో చూపించడానికి ఈనెల 20వ తేదీన హైదరాబాదులో విద్యార్థుల మిలియన్ మార్చ్ నిర్వహించి తీరుతామని హెచ్చరించారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు తప్ప చేతలు లేవని, మూడు ట్రిలియన్ డాలర్ల ఆదాయం తెలంగాణ రాష్ట్రం సాధిస్తుందని ఒక వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పగా మాటలు చెబుతున్నాడని, వారు అనుకున్న మూడు ట్రీలియన్ ఆదాయం రావాలంటే మానవ వనరుల అభివృద్ధి జరగాలని మానవ వనరుల అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి స్వశక్తితో ఎదగాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు ఉన్నత చదువుకు ఆసరాగా ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేసే బాధ్యత ఉండాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ అవినీతి విధానాల వలన రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గంధరగోళంలోకి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శాసన సభ పక్ష నేత సిరికొండ మధుసూదన చారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల ఉన్నత విద్య పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యహ రిస్తుందని, తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగానైతే ఆంధ్ర పాలకుల మెడలు వంచామో అదే స్ఫూర్తితో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఫీజు రియంబర్స్‌మెంట్ సాధించుకోవాలని అందుకు బీఆర్ఎస్ పార్టీ బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని పదేపదే చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి తన మూడు రాష్ట్ర బడ్జెట్ లలో ఎవరెవరికి ఎంత ఇచ్చారో, ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా చెందుతుందని, విద్యార్థులు ఒకవైపు ఫీజులు బకాయిలు చెల్లించాలని ఒకవైపు ఉద్యమిస్తుంటే, ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వృధా చేస్తూ మూసి సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ అంటూ మోసం చేస్తుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన వామపక్ష విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బందుకు పిలుపునిచ్చాయని, ఆ బందుకు, బీసీ ఉద్యమాలకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ప్రకటించారు. విద్యార్థుల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అదే అదే విద్యార్థులు ఈ రోజు చదువుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం తగదని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ అన్నారు. బీసీ విద్యార్థులు చేస్తున్న ఫీజు రియంబర్స్‌మెంట్ పోరాటానికి తమ పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరాం మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కార్యనిర్వాహ అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కుర్మా, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహ నాయక్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేశ్వరి, బీసీ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ రమేష్, కౌలే జగన్నాథం, వరుణ్ కుమార్, నాయకులు సత్యరాజ్ గౌడ్ గౌతమి, దేవిక, ఇంద్రమ్ రజక, మీసాల గణేష్, రాజేశ్వరి, కోటి, బండి గారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఉచిత పథకాలు ఎవరడిగారు?

**తెలంగాణ సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చట్టబద్ధతపై సందేహాలు**

**అసెంబ్లీ ఆమోదం లేకుండా ప్రజాధనం పంపిణీ ఎలా?.. 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం**



హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు తీవ్ర సందేహాలను వ్యక్తం చేసింది. శాసనసభ ఆమోదం లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) ద్వారా ఈ పథకాలను ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పథకాలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ బుధవారం విచారించారు. చట్టసభ ఆమోదం లేకుండా ప్రజాధనాన్ని పంపిణీ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246లకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈ పథకాలకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలను రద్దు చేయాలని కోరారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉద్యోగులకు జీతాలు ఆలస్యమవుతున్నాయి, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణ పరిహారం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి, నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారు. మరోవైపు రాష్ట్రం అప్పుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు ఉంటే ఉచితాలు ఇవ్వవచ్చని, కానీ చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ.13,484 కోట్లు ఖర్చు చేశారని, కాగ్ నివేదికల ప్రకారం సుమారు రూ.90 కోట్లు అనర్హులకు అందాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ తరపున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం, నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. అయితే, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

# ఎడారిలో పూడ్చిపెట్టారు!

**కువైట్‌లో వీడిన తెలంగాణ యువకుడి మిస్సింగ్ మిస్టరీ**

**పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మృతి..**

**ఎడారిలో పూడ్చిపెట్టిన యజమానులు**

**మృతుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన గుగులోత్ కైలాష్‌గా గుర్తింపు**

నిజామాబాద్, జూలై 8 (ఈవార్తలు): ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లిన తెలంగాణ యువకుడి అదృశ్యం ఉదంతం విషాదాంతమైంది. కొన్ని నెలల క్రితం అదృశ్యమైన సదరు యువకుడి మృతదేహాన్ని కువైట్ పోలీసులు ఎడారి ప్రాంతంలో గుర్తించారు. పని ప్రదేశంలో జరిగిన ప్రమాదాన్ని కప్పిపుచ్చేందుకు యజమానులు మృతదేహాన్ని రహస్యంగా పాతిపెట్టినట్లు విచారణలో వెల్లడైంది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కోరట్‌పల్లి తండాకు చెందిన గుగులోత్ కైలాష్ (30) మెకానికల్ ఇంజనీర్‌గా కువైట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది మార్చి 19న అల్-సల్మీ ఎడారి ప్రాంతంలో ఓ భారీ యంత్రానికి (జేసీబీ/క్రేన్) మరమ్మతులు చేసేందుకు యజమానితో కలిసి వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు సదరు యంత్రం కుప్పకూలడంతో కైలాష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన యజమాని, అతని కుమారుడు చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఈ క్రమంలో కైలాష్ మృతదేహాన్ని ఎడారిలోని నిర్మానుష్య ప్రాంతానికి తరలించి రహస్యంగా పూడ్చిపెట్టారు. అయితే, కొద్ది రోజుల తర్వాత తీవ్రమైన ఎండల ప్రభావంతో మృతదేహం పాక్షికంగా బయటపడింది. కైలాష్ అదృశ్యంపై కేసు నమోదు చేసిన కువైట్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, కైలాష్ నిందితులతో కలిసి ఎడారిలోకి వెళ్లినట్లు, కానీ తిరిగి రానట్లు స్పష్టమైంది. దీంతో యజమాని కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడి సమాచారంతో మృతదేహాన్ని వెలికితీసిన ఫోరెన్సిక్ బృందాలు అవశేషాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ కేసులో ఒకరిని అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు దేశం విడిచి పారిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కైలాష్ మృతితో అతని స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మీరివ్వలే.. మేమే తెచ్చుకున్నం

**కిషన్ రెడ్డిపై భట్టి ఫైర్.. తాడిచెర్ల-2పై కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): తెలంగాణలో తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ అంశం రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే ఈ బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గట్టి కౌంటర్ ఇచ్చారు. ఇది కొత్త కేటాయింపు కాదని, రాష్ట్ర ప్రభుత్వం పోరాడి అనుమతులు తెచ్చుకుందని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. తాడిచెర్ల-2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం సంతోషకరమేనని చెప్పారు. అయితే ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాస్తవాలను దాస్తున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాడిచెర్ల-2 బొగ్గు గనిని 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని భట్టి తెలిపారు. అలాంటప్పుడు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించింది ఏంటని ప్రశ్నించారు. బ్లాక్ కేటాయించినప్పటికీ మైనింగ్ లీజుకు అవసరమైన అనుమతులు మాత్రం ఇవ్వలేదని చెప్పారు. కొత్త చట్టం ప్రకారం తాడిచెర్ల-2ను సింగరేణికి ఇవ్వబోమని కేంద్రం చెప్పిందన్నారు. అయితే ఆ చట్టం అమల్లోకి రాకముందే ఈ బ్లాక్ సింగరేణికి కేటాయించిన విషయాన్ని తాము ప్రధాని, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పోరాడటంతో చివరకు అనుమతులు వచ్చాయని చెప్పారు. ఇప్పటికైనా అనుమతులు ఇచ్చినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణపై నిజంగా బీజేపీకి ప్రేమ ఉంటే సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని భట్టి డిమాండ్ చేశారు. అదే తెలంగాణ ప్రయోజనాలను కాపాడే నిర్ణయమవుతుందని అన్నారు.

## పవన్ అభిమాని నిరంజన్ మృతి

**బాధిత కుటుంబానికి సోనూసూద్ వీడియో కాల్**

హనుమకొండ/హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని అయిన పొనుగంటి నిరంజన్ (17) అనారోగ్యంతో కన్నుమూశాడు. హన్మకొండకు చెందిన నిరంజన్, అరుదైన జన్యుపరమైన వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. తీవ్ర అనారోగ్యంతో పోరాడుతున్నప్పటికీ, జీవితంపై కొండంత ఆత్మవిశ్వాసంతో ఉన్న నిరంజన్ మరణవార్త అందరినీ కలచివేసింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఇమామ్‌లకు 99 గజాల స్థలం ప్రకటన అబద్ధం

**ప్రచారంతో సంబంధం లేదని వక్ఫ్ బోర్డ్ స్పష్టీకరణ**

హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): ఇమామ్‌లు, మౌజన్‌ల కుటుంబాలకు 99 గజాల చొప్పున స్థలాలు కేటాయిస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు తీవ్రంగా ఖండించింది. ఇదొక మోసపూరిత ప్రకటన అని, ప్రజలు ఇలాంటి వార్తలను నమ్మవద్దని బుధవారం స్పష్టం చేసింది. కిషన్‌బాగ్‌కు చెందిన 'సూఫీ ఉలేమా కౌన్సిల్' అనే సంస్థ పేరుతో ఉర్దూలో ముద్రించిన ఒక కరపత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇమామ్‌లు, మౌజన్‌ల భార్యలు, సోదరీమణులు లేదా తల్లులకు 99 గజాల స్థలం కేటాయిస్తామని, ఇందుకు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ వంటి ధ్రువీకరణ పత్రాలతో కిషన్‌బాగ్‌లోని ఒక చిరునామాలో దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. ఇందుకు జూలై 15ను తుది గడువుగా ప్రకటించారు. ఈ నకిలీ నోటీసుతో వక్ఫ్ బోర్డుకు గానీ, తెలంగాణ ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు. సదరు కరపత్రంలో పేర్కొన్న 'సూఫీ ఉలేమా కౌన్సిల్' అనే సంస్థతో తమకు ఎటువంటి అనుబంధం లేదని బోర్డు పౌర సంబంధాల అధికారి వెల్లడించారు. అమాయక ప్రజల నుంచి వ్యక్తిగత వివరాలు సేకరించి మోసం చేసేందుకే ఈ నకిలీ నోటీసును సృష్టించి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇమామ్‌లు, మౌజన్‌లు, వక్ఫ్ సంస్థల ప్రతినిధులు మరియు సాధారణ ప్రజలు ఈ ప్రకటనను నమ్మి తమ పత్రాలను ఎక్కడా సమర్పించవద్దని బోర్డు విజ్ఞప్తి చేసింది. ఈ నకిలీ ప్రచారానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు తెలిపింది.

## అసలు ఆమెకు ఏం తెల్సు?

**నేనుందుకు వివరణ ఇస్తా?**

**కొండా సురేఖ ఫిర్యాదుపై కడియం కౌంటర్**

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 8 (ఈవార్తలు): తనకు చెందిన దేవాదాయ శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరిని వివరణ కోరాలని... విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఆమె కోరారు. సురేఖ చేసిన ఫిర్యాదుపై కడియం శ్రీహరి తీవ్రంగా స్పందించారు. "నేను ఏ తప్పూ చేయలేదు. అలాంటప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తాను ఎప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేసిన కడియం... ఇదంతా కేవలం అవగాహన లోపం వల్లనే జరుగుతోందని అన్నారు. దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదనే విషయం ఒక ప్రజాప్రతినిధిగా తనకు తెలుసని కడియం శ్రీహరి అన్నారు. "నా నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే సంబంధిత శాఖ కమిషనర్, అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశాను. అక్కడ ఎలాంటి అధికారిక సమీక్ష నిర్వహించలేదు. కేవలం క్షేత్రస్థాయి సమస్యలను మాత్రమే వారి దృష్టికి తీసుకెళ్లాను" అని వివరించారు. దేవాదాయ శాఖలో నిధులు లేవని చెప్పడంతో... ఆలయాల అభివృద్ధికి సంబంధించిన ఎస్టిమేషన్‌లను (అంచనాలను) మాత్రమే కోరినట్లు వెల్లడించారు. ఈ వివాదంపై కొండా సురేఖను ఉద్దేశించి కడియం శ్రీహరి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారు. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ... వార్తల్లో ఉంటూ ప్రజల మధ్య బతకాలని చూస్తున్నారు" అని ఎద్దేవా చేశారు.

## డీఆర్డీవో పినాక పరీక్ష సక్సెస్

భువనేశ్వర్: భారత రక్షణ వ్యవస్థ మరో మైలురాయిని అందుకుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. డీఆర్డీవో బుధవారం ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ రాకెట్‌ను స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేశామని, దీనికి నిర్దేశించిన అన్ని లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసిందని రాజ్‌నాథ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 డిసెంబర్‌లో ఇదే రాకెట్‌ను 120 కిలోమీటర్ల పరిధిలో ప్రయోగించారు. ప్రస్తుతం ఈ రాకెట్ పరిధి 60 కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్ల మధ్యలో ఉంది. ఈ ప్రయోగంతో రక్షణ వ్యవస్థకు మరింత బలం చేకూరిందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.

## టీఎంసీ 440 కోట్ల నిధులు ఫ్రీజ్

**మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్**

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన 'కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

## మోదీకి ఐదు యుద్ధ విమానాల ఎస్కార్ట్

**ఇండోనేషియా మరో అరుదైన గౌరవం**

**అధ్యక్షుడు ప్రబోవో స్వయంగా వీడ్కోలు**

న్యూఢిల్లీ: మూడు రోజుల అధికారిక పర్యటన ముగించుకుని ఇండోనేషియా నుంచి ఆస్ట్రేలియాకు బయలుదేరిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశం నుంచి అరుదైన గౌరవం దక్కింది. మోదీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానానికి ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన ఐదు యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వెళ్లాయి. రెండు దేశాల మధ్య బలపడుతున్న సంబంధాలకు ఇది ప్రతీకగా నిలిచింది. ఇండోనేషియా గగనతలంలో మోదీ విమానంతో పాటు యుద్ధ విమానాలు సమాంతరంగా ప్రయాణించిన దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మోదీ జకార్తాకు చేరుకున్న సమయంలోనూ ఆయన విమానానికి ఇండోనేషియా ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా వచ్చి స్వాగతం పలికాయి. పర్యటన ముగిసిన తర్వాత ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీకి వీడ్కోలు పలికారు. విమానంలోకి ఎక్కే ముందు ఇద్దరు నాయకులు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ పర్యటనతో భారత్, ఇండోనేషియా మధ్య పలు కీలక రంగాల్లో సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని ప్రధాని మోదీ తెలిపారు. రక్షణ, భద్రత, సముద్ర సహకారం, కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేసే దిశగా కీలక అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. తనకు ఆత్మీయ స్వాగతం పలికిన ఇండోనేషియా ప్రజలకు, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన చూపిన వ్యక్తిగత చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

## మైక్రోసాఫ్ట్‌కు ఏఐ కష్టాలు

**భారీ ఖర్చుల దెబ్బ.. సొంత ఏఐ వినియోగం**

న్యూయార్క్: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడానికి కీలక నిర్ణయం తీసుకుంది. ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి వ్యయభరితమైన థర్డ్ పార్టీ ఏఐ సిస్టమ్స్‌పై ఆధారపడటాన్ని నియంత్రిస్తూ, సొంతంగా అభివృద్ధి చేసిన 'ఎంఏఐ' మోడల్స్‌ను వినియోగించడం ప్రారంభించింది. ఎక్సెల్, ఔట్‌లుక్ వంటి తమ పాపులర్ అప్లికేషన్లలో ఇప్పటికే ఈ మార్పును అమలు చేస్తోంది. తాజా నివేదికల ప్రకారం, మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వారానికి పదుల వేల సంఖ్యలో యూజర్ రిక్వెస్టులను తన సొంత ఎంఏఐ మోడల్స్‌కు మళ్లిస్తోంది. మొత్తం రిక్వెస్ట్‌లతో పోలిస్తే ఇది తక్కువ శాతమే అయినప్పటికీ, ఏఐ నిర్వహణ ఖర్చులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అదుపు చేసేందుకు ఇది ఒక వ్యూహాత్మక అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. గత జూన్ నెలలో నిర్వహించిన 'బిల్డ్' కాన్ఫరెన్స్‌లో మైక్రోసాఫ్ట్ ఏడు కొత్త ఎంఏఐ మోడల్స్‌ను పరిచయం చేసింది. ప్రస్తుతం వాటిని వ్యూహాత్మకంగా తమ ఉత్పత్తులలో అనుసంధానిస్తోంది. సాధారణ మరియు తేలికపాటి పనుల కోసం ఎంఏఐ మోడల్స్‌ను ఉపయోగిస్తూ, కేవలం సంక్లిష్టమైన ప్రశ్నల కోసం మాత్రమే ఓపెన్‌ఏఐ వంటి శక్తిమంతమైన, ఖరీదైన మోడల్స్‌ను వినియోగించాలని నిర్ణయించింది. బ్లూమ్‌బెర్గ్ కథనం ప్రకారం, ఈ మార్పు వల్ల మైక్రోసాఫ్ట్‌కు నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కేవలం మైక్రోసాఫ్ట్ మాత్రమే కాకుండా అమెజాన్, ఉబెర్, మెటా, యాక్సెంచర్ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఏఐ నిర్వహణ వ్యయాన్ని నియంత్రించే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఏఐ ద్వారా ఉత్పాదకత పెరిగినప్పటికీ, దాని నిర్వహణకు అయ్యే భారీ వ్యయాలను తగ్గించుకోవడం ప్రస్తుతం టెక్ కంపెనీలకు సవాలుగా మారింది. ఏఐ రంగం పరిణతి చెందుతున్న దశకు ఈ పరిణామాలే నిదర్శనమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## 37 ఏళ్లుగా పనిచేస్తున్నా.. నాకూ లేఆఫ్!

**ఎక్స్‌బాక్స్ వైస్ ప్రెసిడెంట్ ఆవేదన**


న్యూయార్క్: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన గేమింగ్ విభాగమైన 'ఎక్స్‌బాక్స్'లో భారీ పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 4,800 మంది ఉద్యోగులను తొలగిస్తుండగా, ఇందులో మెజారిటీ ఉద్యోగులు ఎక్స్‌బాక్స్ విభాగానికి చెందిన వారే కావడం గమనార్హం. దాదాపు 37 ఏళ్లుగా సంస్థలో సేవలందిస్తున్న వైస్ ప్రెసిడెంట్ కెవిన్ లాచాపెల్‌ను సైతం ఈ లేఆఫ్స్ జాబితాలో చేర్చడం ఇప్పుడు కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మైక్రోసాఫ్ట్ ప్రకటించిన ఈ కోతల్లో భాగంగా ఎక్స్‌బాక్స్ విభాగం నుండి సుమారు 3,200 మందిని, అంటే దాదాపు 20 శాతం ఉద్యోగులను తొలగిస్తున్నారు. జూలై 6న వెలువడిన ప్రకటన ప్రకారం, తక్షణమే 1,600 మందిని విధుల్లో నుంచి తొలగించగా, 2027 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి మరో 1,600 మందిని తొలగించనున్నారు. ఎక్స్‌బాక్స్ చరిత్రలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ అని సంస్థ సీఈఓ ఆశా శర్మ ఉద్యోగులకు పంపిన మెమోలో పేర్కొన్నారు. తనను కూడా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు కెవిన్ లాచాపెల్ స్వయంగా తన లింక్డ్ఇన్ పోస్ట్‌లో వెల్లడించారు. 1989లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా మైక్రోసాఫ్ట్‌లో చేరిన ఆయన, సంస్థతో తనకున్న సుదీర్ఘ ప్రయాణం ముగిసిందని పేర్కొన్నారు. ఎక్స్‌బాక్స్‌లో అత్యంత కీలకమైన "బ్యాక్‌వర్డ్ కంపాటిబిలిటీ" ప్రోగ్రామ్‌కు ఆయన నాయకత్వం వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

# పారాచూట్ల పరీక్ష విజయవంతం

**గగన్‌యాన్ దిశగా మరో ముందడుగు.. క్రూ క్యాప్సూల్‌ను సురక్షితంగా దించే కీలక వ్యవస్థ**

**ఇస్రో, డీఆర్‌డీవో, వైమానిక దళం, సైన్యం సంయుక్తంగా పరీక్ష నిర్వహణ**

భోపాల్: భారత తొలి మానవ అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్‌లో మరో కీలక ఘట్టం పూర్తైంది. వ్యోమగాములు ప్రయాణించే క్రూ క్యాప్సూల్‌ను అంతరిక్షం నుంచి సురక్షితంగా భూమిపైకి తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రధాన పారాచూట్ వ్యవస్థను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. దీంతో గగన్‌యాన్ మిషన్ మరో అడుగు ముందుకు వేసింది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లో ఉన్న ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ డ్రాప్ జోన్‌లో ఈ పరీక్ష నిర్వహించారు. దీనిని 'ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్'గా ఇస్రో పేర్కొంది. అంతరిక్షం నుంచి భూవాతావరణంలోకి ప్రవేశించిన తర్వాత క్రూ క్యాప్సూల్ వేగాన్ని తగ్గించి సముద్రంలో సురక్షితంగా దిగేలా చేయడంలో ఈ పారాచూట్లు కీలక పాత్ర పోషిస్తాయి. గగన్‌యాన్ క్రూ మాడ్యూల్‌లో మొత్తం 10 పారాచూట్లు ఉంటాయి. ఇవి నాలుగు రకాలుగా పనిచేస్తాయి. మొదట రెండు అపెక్స్ కవర్ సెపరేషన్ పారాచూట్లు రక్షణ కవర్‌ను తొలగిస్తాయి. తర్వాత రెండు డ్రోగ్ పారాచూట్లు క్యాప్సూల్‌ను స్థిరపరిచి వేగాన్ని తగ్గిస్తాయి. ఆ తర్వాత మూడు పైలట్ పారాచూట్లు పనిచేసి మూడు ప్రధాన పారాచూట్లను తెరుస్తాయి. చివరగా ఈ ప్రధాన పారాచూట్లు క్యాప్సూల్ వేగాన్ని భారీగా తగ్గించి సముద్రంలో సురక్షితంగా దిగేలా చేస్తాయి. అనంతరం రికవరీ బృందాలు వ్యోమగాములను బయటకు తీసుకొస్తాయి. తాజా పరీక్షలో భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76 విమానం నుంచి 2.5 కిలోమీటర్ల ఎత్తు నుంచి డమ్మీ బరువుతో కూడిన ప్రధాన పారాచూట్ వ్యవస్థను వదిలారు. ముందుగా ఎక్స్‌ట్రాక్టర్ పారాచూట్, ఆ తర్వాత డ్రోగ్ పారాచూట్ పనిచేశాయి. అవసరమైన పరిస్థితులు ఏర్పడిన తర్వాత ప్రధాన పారాచూట్ విజయవంతంగా తెరుచుకుని డమ్మీ బరువు వేగాన్ని సురక్షిత స్థాయికి తగ్గించింది. గగన్‌యాన్ తొలి మానవరహిత ప్రయోగం జీ1 మిషన్‌లో ఎదురయ్యే అత్యధిక ఒత్తిడి పరిస్థితుల్లో కూడా ప్రధాన పారాచూట్ సమర్థంగా పనిచేస్తుందో లేదో నిర్ధారించడమే ఈ పరీక్ష లక్ష్యమని ఇస్రో తెలిపింది. ఈ పరీక్ష విజయవంతం కావడంతో పారాచూట్ వ్యవస్థ పనితీరుపై మరింత విశ్వాసం పెరిగిందని వెల్లడించింది. ఇస్రో, డీఆర్‌డీవో, భారత వైమానిక దళం, భారత సైన్యం సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహించాయి. గగన్‌యాన్ తొలి మానవరహిత ప్రయోగానికి ముందు కీలక వ్యవస్థలను ధ్రువీకరించే ప్రక్రియలో ఈ పరీక్షకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.



# 15లోగా పీఎఫ్ వడ్డీ జమ

**క్లెయిమ్ సెటిల్‌మెంట్లలో వేగం.. ఈపీఎఫ్‌ఓలో కీలక మార్పులు**




న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సేవలను ఆధునికీకరించే దిశగా ఒక భారీ ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న సభ్యులందరి రికార్డులను ఒకే కేంద్రీకృత జాతీయ డేటాబేస్‌లోకి మార్చే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు బుధవారం ప్రకటించింది. 'కేంద్రీకృత ఐటీ ఆధారిత సేవలు' (సీఐటీఈఎస్) ప్రాజెక్టులో భాగంగా ఈ మార్పును చేపట్టారు. దీని ద్వారా ఆటోమేషన్, నిబంధనల ఆధారిత ప్రాసెసింగ్‌తో సభ్యులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కొత్త విధానం వల్ల కలిగే తక్షణ ప్రయోజనాల్లో పీఎఫ్ వడ్డీ జమ ఒకటి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రకటించిన 8.25 శాతం వడ్డీని జులై 15వ తేదీ నాటికి సభ్యుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఈపీఎఫ్ఓ తెలిపింది. దీని ద్వారా సుమారు 34 కోట్ల ఖాతాల్లోకి రూ.1.44 లక్షల కోట్లకు పైగా మొత్తం జమ కానుంది. గతంలో వడ్డీ రేటు ప్రకటించిన తర్వాత, అది ఖాతాల్లో జమ కావడానికి అక్టోబర్-నవంబర్ వరకు సమయం పట్టేది. కానీ ఇప్పుడు ఆ ప్రక్రియ చాలా వేగంగా పూర్తి కానుంది. సభ్యులు తమ పాస్‌బుక్‌లో వడ్డీ జమ వివరాలను జులై 15 నుంచి చూసుకోవచ్చు. ఉద్యోగులకు అత్యంత ప్రయోజనకరమైన మార్పులలో మరొకటి పీఎఫ్ ఖాతా బదిలీ. ఇకపై ఉద్యోగం మారినప్పుడు పీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకోవడం అత్యంత సులభం కానుంది. ఆధార్‌తో అనుసంధానమైన యూఏఎన్ ఖాతాలు ఉన్న సభ్యులు కొత్త ఉద్యోగంలో చేరినప్పుడు, వారి పీఎఫ్ బ్యాలెన్స్ ఆటోమేటిక్‌గా కొత్త ఖాతాలోకి బదిలీ అవుతుంది. దీనికోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు. గతంలో ఉద్యోగం మారినప్పుడు పాత, కొత్త యాజమాన్యాల ఆమోదంతో పాటు, ఈపీఎఫ్ఓ కార్యాలయం అనుమతి పొందాల్సి వచ్చేది. ఈ కొత్త విధానం ఆ శ్రమను పూర్తిగా తొలగిస్తుంది. క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను కూడా గణనీయంగా మెరుగుపరిచారు. కేవైసీ పూర్తి చేసి, ధ్రువీకరించిన ఖాతాదారులు తీసుకునే అడ్వాన్సుల కోసం ఆటో-సెటిల్మెంట్ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారు. దీనివల్ల అత్యవసర సమయాల్లో డబ్బు వేగంగా చేతికి అందుతుంది. క్లెయిమ్ ప్రాసెసింగ్ సమయంలో ఏవైనా సందేహాలుంటే, అధికారులు ఆన్‌లైన్‌లోనే సభ్యులను సంప్రదిస్తారు. సభ్యులు కూడా ఆన్‌లైన్‌లోనే సమాధానం ఇవ్వొచ్చు. ఇది కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని తగ్గిస్తుంది. క్లెయిమ్ తిరస్కరణలు కూడా తగ్గుతాయి. సెటిల్ అయిన మొత్తం అదే రోజున నేరుగా సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

## రూ.55కే 1,000కిపైగా టీవీ ఛానళ్లు

**జియో సూపర్ ప్లాన్**

**30 రోజుల వ్యాలిడిటీ**

**150కిపైగా ప్రీమియం ఛానళ్లు**

ముంబై: వినోద ప్రియుల కోసం రిలయన్స్ జియో కొత్త రీచార్జ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. కేవలం రూ.55తో 30 రోజుల పాటు జియోటీవీ యాప్‌లో 1,000కిపైగా లైవ్ టీవీ ఛానళ్లను వీక్షించే అవకాశం కల్పించింది. ఈ ప్లాన్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ వినియోగదారులిద్దరికీ అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్‌లో 16కుపైగా భాషల్లో ప్రసారమయ్యే 1,000కి పైగా లైవ్ టీవీ ఛానళ్లను చూడొచ్చు. అలాగే 150కుపైగా ప్రీమియం ఛానళ్లు కూడా అందుబాటులో ఉంటాయని జియో తెలిపింది. స్టార్‌ప్లస్ హెచ్‌డీ, కలర్స్ హెచ్‌డీ, సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ హెచ్‌డీ, డిస్కవరీ, యానిమల్ ప్లానెట్ వంటి ఛానళ్లు ఇందులో భాగంగా ఉంటాయి. జియోస్టార్, సోనీ ఎంటర్‌టైన్‌మెంట్, సన్ టీవీ నెట్‌వర్క్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, ఈటీవీ నెట్‌వర్క్‌కు చెందిన పలు ఛానళ్లు కూడా ఈ ప్లాన్‌లో లభిస్తాయి. అయితే జియోస్టార్, సోనీకి చెందిన లైవ్ స్పోర్ట్స్ ఛానళ్లను మాత్రం ఈ ప్లాన్‌తో వీక్షించే అవకాశం ఉండదు. ఈ ప్లాన్‌కు ప్రత్యేకంగా యాక్టివేషన్ అవసరం లేదని జియో తెలిపింది. రూ.55తో రీచార్జ్ చేసిన తర్వాత జియోటీవీ యాప్‌లో జియో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయితే వెంటనే ప్రీమియం ఛానళ్లు అందుబాటులోకి వస్తాయి. అయితే ఈ ప్లాన్‌లో వాయిస్ కాల్స్, మొబైల్ డేటా, ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలు ఉండవు. ఇది పూర్తిగా వినోదం కోసం రూపొందించిన ప్లాన్. ఒక మొబైల్ డివైజ్‌లో మాత్రమే ఈ సబ్‌స్క్రిప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువసార్లు రీచార్జ్ చేస్తే ప్రస్తుత 30 రోజుల గడువు ముగిసిన తర్వాత తర్వాతి ప్లాన్ ఆటోమేటిగ్గా అమల్లోకి వస్తుంది.

## కార్యకర్తపై మమత దాడి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తన సొంత పార్టీ కార్యకర్తపై చేయి చేసుకున్న ఘటన చర్చనీయాంశమైంది. బుధవారం కోల్‌కతాలో నిర్వహించిన ఒక నిరసన ర్యాలీలో చోటుచేసుకున్న గందరగోళం మధ్య, సహనం కోల్పోయిన మమత ఓ కార్యకర్త చెంపపై కొట్టారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బారుయ్‌పూర్‌లో 11 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ టీఎంసీ యువజన విభాగం ఈ ర్యాలీని చేపట్టింది. కోల్‌కతా హైకోర్టు అనుమతితో ప్రారంభమైన ఈ ర్యాలీని హాజ్రా రోడ్డు వద్ద బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. "చోర్, చోర్" (దొంగ, దొంగ) అంటూ నినాదాలు చేస్తూ టీఎంసీ శ్రేణులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ర్యాలీ ముగిసిన అనంతరం మమతా బెనర్జీ తన కాళీఘాట్ నివాసానికి చేరుకున్న సమయంలో అక్కడ భారీగా జనం గుమిగూడారు. ఆ సమయంలో తనకు దారి కల్పించేందుకు ప్రయత్నిస్తున్న ఒక కార్యకర్తపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేయి చేసుకున్నారు. ఈ క్రమంలో ఇతరులను కూడా ఆమె పక్కకు నెట్టివేస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. ఈ ఘటనపై మమతా బెనర్జీ స్పందిస్తూ, బీజేపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగానే పక్కా ప్రణాళికతో తమ ర్యాలీపై దాడి చేశారని ఆరోపించారు.

# భారత్ మెచ్చిన బీఎండబ్ల్యూ


**ఎలక్ట్రిక్ కార్లకు భారీ డిమాండ్**



న్యూఢిల్లీ: భారత్‌లో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో బీఎండబ్ల్యూ గ్రూప్ రికార్డు స్థాయి అమ్మకాలు నమోదు చేసింది. జనవరి నుంచి జూన్ వరకు మొత్తం 9,075 కార్లు విక్రయించినట్లు కంపెనీ వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 17 శాతం వృద్ధి అని తెలిపింది. ఒక్కసారిగా పెరిగిన డిమాండ్ వల్ల కాకుండా, మార్కెట్లో స్థిరమైన ఆదరణతో ఈ ఫలితాలు సాధించినట్లు పేర్కొంది. ఈ కాలంలో ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు కంపెనీకి ప్రధాన బలంగా నిలిచాయి. తొలి ఆరు నెలల్లో 2,359 ఎలక్ట్రిక్ వాహనాలు విక్రయించగా, ఇది గతేడాదితో పోలిస్తే 78 శాతం అధికం. మొత్తం అమ్మకాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 26 శాతంగా నమోదైంది. అంటే ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్ వాహనమే. లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో 69 శాతం మార్కెట్ వాటాతో బీఎండబ్ల్యూ అగ్రస్థానాన్ని కొనసాగించింది. లాంగ్ వీల్‌బేస్ కార్లకు కూడా వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ విభాగంలో అమ్మకాలు 24 శాతం పెరిగి 4,428 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా 52 శాతంగా ఉంది. అలాగే స్పోర్ట్స్ యాక్టివిటీ వెహికల్స్ విక్రయాలు 35 శాతం పెరిగి 5,926 యూనిట్లకు చేరాయి. మొత్తం అమ్మకాల్లో ఈ విభాగం వాటా 65 శాతంగా నమోదైంది. కంపెనీకి చెందిన మినీ బ్రాండ్ కూడా మంచి వృద్ధిని నమోదు చేసింది. తొలి ఆరు నెలల్లో 504 కార్లు విక్రయించగా, ఇది 70 శాతం పెరుగుదల. కొత్త 'కంట్రీమ్యాన్ సీ' మోడల్‌తో పాటు ప్రత్యేక ఎడిషన్లకు మంచి డిమాండ్ రావడం దీనికి కారణమని కంపెనీ తెలిపింది. బీఎండబ్ల్యూ మోటోరాడ్ విభాగం కూడా 2,327 మోటార్‌సైకిళ్లను విక్రయించింది. ఇటీవల డెలివరీలు ప్రారంభమైన కొత్త ఎఫ్ 450 జీఎస్ తొలి బ్యాచ్ పూర్తిగా అమ్ముడైనట్లు వెల్లడించింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 11 కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకొచ్చామని, మిగిలిన నెలల్లో మరో 14 కొత్త ఉత్పత్తులను విడుదల చేయనున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రకటించింది. అలాగే దేశవ్యాప్తంగా రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ ప్రస్తుతం 40 నగరాల్లో 100 టచ్‌పాయింట్లతో సేవలందిస్తున్నామని, ఈ ఏడాదిలో మరో 19 అవుట్‌లెట్లను ప్రారంభించనున్నట్లు తెలిపింది.

# ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు

**కేంద్ర మంత్రి గడ్కరీ ఘాటు కౌంటర్**



పుణే: ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.


# సారు సంతకాన్ని గెలికేశారు!

## మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ.. మరో వివాదంలో జగిత్యాల మున్సిపాలిటీ

### మున్సిపల్ రికార్డుల్లో ఫోర్జరీ సంతకాలు.. ఎంసీ ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు



జగిత్యాల బ్యూరో, జూలై 8 (ఈవార్తలు): అసెస్‌మెంట్ కోసం ఏకంగా జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు ఘరానా మోసగాళ్లు. నకిలీ అసెస్‌మెంట్ కాపీల ఆధారంగా మ్యూటేషన్ నిర్వహించి, అనంతరం ఆస్తి రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కమిషనర్ స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు దశకు చేరింది. మున్సిపల్ రికార్డుల ప్రకారం పట్టణానికి చెందిన సమిండ్ల మల్లయ్య పేరిట ఉన్న 3-5-128 ఇంటి నంబరుకు 2011-12 నుంచి 2026-27 వరకు రూ.52,356 ఆస్తి పన్ను బకాయిలు ఉన్నట్లు సమాచారం. అయినప్పటికీ, భవనాన్ని 40 ఏళ్ల క్రితం నిర్మించినదిగా చూపిస్తూ పన్ను మినహాయింపు పొందేందుకు నకిలీ అసెస్‌మెంట్ కాపీలు సిద్ధం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఆస్తి పన్ను బకాయిలు ఉన్న ఆస్తులకు రిజిస్ట్రేషన్‌కు అవసరమైన ప్రక్రియ చేపట్టరాదు. అయితే ఆ నిబంధనలను పక్కనబెట్టి కమిషనర్ సంతకాన్ని సాఫ్ట్ కాపీల్లో ఫోర్జరీ చేసి అసెస్‌మెంట్ పత్రాలు రూపొందించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పత్రాల ఆధారంగా జూన్ 25న 3-5-128, 3-5-128/1/ఏ/1 నంబర్లతో మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు సమాచారం. అనంతరం డాక్యుమెంట్ నంబర్ 4239/2026 కింద పార్టిషన్ డీడ్ ద్వారా సమిండ్ల రాజేష్, సమిండ్ల గంగారాం పేర్లపై రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో మున్సిపల్



చైర్‌పర్సన్‌కు సంబంధించిన బంధువుల పేర్లు వినిపిస్తుండటంతో మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ ఘటనపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన విషయంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అసెస్‌మెంట్ కాపీలను కార్యాలయం నుంచి బయటకు ఇవ్వబోమని, అలాంటప్పుడు అవి ఎలా బయటకు వెళ్లాయనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. పూర్తి విచారణ అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ విచారణలు జరిగిన నేపథ్యంలో మరోసారి ఫోర్జరీ ఆరోపణలు వెలుగుచూడడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనతో పాటు మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఇతర అక్రమాలపైనా సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## చురుగ్గా బీఆర్ఎస్ 'సర్' ఉద్యమం

**జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీత ఇంటింటి అవగాహన**

జూబ్లీహిల్స్-హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్ ఏ-బ్లాక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో "ప్రతి ఇంటికి సర్ అవగాహన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మాగంటి సునీత గోపీనాథ్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఓటరు తమ ఓటరు జాబితాలోని వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అవసరమైతే సవరణలు, కొత్త నమోదులు నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్రజలు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులతో కలిసి సర్ ప్రక్రియ ప్రాముఖ్యతపై చర్చించారు. ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తూ, ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీన్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ క్రియాశీలక సభ్యులు, స్థానిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి: దావ వసంత



జగిత్యాల, జూలై 8 (ఈవార్తలు): ఎరువులు, విత్తనాల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి నిర్వహించిన ఫోన్-ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ మాట్లాడారు. గతంలో డీఏపీ ఎరువు ధర రూ.1,350 ఉండగా ప్రస్తుతం రూ.2,100కు పెరిగిందని, ధరల పెంపుతో రైతులపై తీవ్ర భారం పడుతోందని అన్నారు. దుకాణాల్లో యూరియా అందుబాటులో లేకపోయినా యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉందని చూపించడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలు కొనసాగుతున్నాయని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులు సమయానికి అందుబాటులో ఉంచాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## అటవీ భూముల చదునుపై కఠిన చర్యలు

**అటవీ క్షేత్రాధికారి పద్మారావు**

మెట్‌పల్లి రూరల్, జూలై 8 (ఈవార్తలు): మెట్‌పల్లి రూరల్, రిజర్వు అటవీ భూములను అక్రమంగా చదును చేయడం, అటవీ సంపదకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అటవీ క్షేత్రాధికారి పద్మారావు హెచ్చరించారు. మండలంలోని రంగారావుపేట పరిధిలోని రిజర్వు అటవీ ప్రాంతాన్ని పరిశీలించి గ్రామ సర్పంచ్ గుర్రం బాలరాజ్‌కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లు, జేసీబీలు, బుల్డోజర్లు తదితర యంత్రాలతో అటవీ భూములను చదును చేయడం చట్టవిరుద్ధమన్నారు. తెలంగాణ అటవీ సంరక్షణ చట్టం--1972, 1984 నిబంధనల ప్రకారం ఇటువంటి పనులకు ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ భూముల్లో ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం బాలరాజ్, ఉపసర్పంచ్ పెద్ద రాజన్న, పాలకవర్గ సభ్యులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 9 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**రూ.3.60 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే సంజయ్**



జగిత్యాల, జూలై 8 (ఈవార్తలు): జగిత్యాల పట్టణానికి చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.3.60 లక్షల విలువైన చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్యతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా రాత్రి పెట్రోలింగ్

**పోలీసులకు ఎస్పీ ఆదేశాలు.. బీర్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ**



బీర్పూర్, జూలై 8 (ఈవార్తలు): ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించే క్రమంలో బుధవారం బీర్పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. గ్రామాలను తరచూ సందర్శిస్తూ స్థానిక పరిస్థితులపై పూర్తి సమాచారం కలిగి ఉండాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి సమిష్టి పోరాటం

**ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పిలుపు**

**హైదరాబాద్‌లో 'నషా ముక్త్ భారత్ అభియాన్' నిర్వహణ**




హైదరాబాద్, జూలై 8 (పీఐబీ): మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి చట్ట అమలు సంస్థలు, విద్యాసంస్థలు, సమాజం, పౌరులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు అన్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' సమగ్ర అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. తెలంగాణ పోలీసులు చేపడుతున్న నిరంతర నిఘా చర్యలతో పాటు 1908 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు అందిస్తున్న సమాచారం డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించి నిర్మూలించడంలో ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ యువతకు తీవ్ర ముప్పుగా మారిందని, ముఖ్యంగా విద్యార్థులు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ ముఠాలు పనిచేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం నుంచి యువతను కాపాడాలంటే విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారిస్తోందని ఆయన వివరించారు. డ్రగ్స్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యసనపరులకు చికిత్స, పునరావాసం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని తెలిపారు. మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' ద్వారా ఆరోగ్యకరమైన, సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని తెలిపారు. అవగాహన, నివారణ, సరైన నిర్ణయాల ద్వారానే డ్రగ్స్ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. వ్యసనానికి బానిసైన వారికి అండగా నిలిచి వారిని తిరిగి సమాజంలో గౌరవప్రదంగా కలిసేలా చేయడం అందరి బాధ్యత అని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ, సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ వ్యసనం కూడా నేటి యువతకు, కుటుంబాలకు, దేశ భవిశ్యత్తుకు పెద్ద సవాలుగా మారిందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, తోటివారిలో కూడా అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా, అధ్యాపకులు, విద్యార్థులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్క మృతిపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): బర్కత్ పుర హౌసింగ్ బోర్డు కాలనీలో లక్ష్మి రెసిడెన్సి వద్ద ఉంటున్న వీధి కుక్క మృతి పై స్థానికులు కాచిగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత 4 సంవత్సరాల క్రితం వీధుల్లో తిరుగుతున్న ఓ కుక్కను స్థానిక యువత చేరదీసి ఆ కుక్కకు గూటి అని నామకరణం చేసి అప్పటి నుంచి దాని బాగోగులు చూసుకుంటున్నారు. గూటి (కుక్క) కాలనీ రక్షకుడిగా ఉండేదని, ఇటీవల రోడ్లపై తిరుగుతున్న కుక్కల గుంపులో గూటి కూడ ఉంది. అందులో ఓ కుక్క బైక్ పై తల్లితో కలిసి వెళ్ళుతున్న బాలున్ని ఓ కుక్క కరవడంతో అతనికి గాయమైంది. దీంతో ఆమె వీధి కుక్కలపై జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారులకు ఫిర్యాదు చేసింది. జూన్ 29వ తేదీన జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చి అక్కడ ఉన్న కుక్కలతో పాటు గూటిని కూడా తీసుకువెళ్ళి ముసాపేటలో ఉన్న కుక్కల షెడ్ కు తరలించారు. వారం రోజులుగా మూసాపేట్ షెడ్ నుంచి గూటిని తీసుకురావడానికి స్థానికులు ఎంత ప్రయత్నించినా అక్కడి వెటర్నరీ అధికారులు వదిలిపెట్టలేదు. గూటి తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో మంగళవారం స్థానికులకు అప్పగించారు. వెంటనే గూటిని స్థానికులు కె.సాయికుమార్, అశ్విన్, వరీష, ఎన్. శరత్ శ్యామ్ లు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. గూటి మృతితో కాలనీలో విశాధ చాయలు అలుముకున్నాయి. గూటి మృతికి జీహెచ్ఎంసీ వెటర్నరీ వైద్యసిబ్బంది, అధికారులే కారణమంటూ కాచిగూడ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు స్థానికులు ఎన్. శరత్ శ్యామ్, అశ్వీన్, వరీష తదితరులు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి కుక్క మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్క మృతికి కారకులైన వారిపై చట్ట పరంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## టీఆర్ లేకుండానే వాహనాల అమ్మకాలు!

**జగిత్యాలలో ద్విచక్రవాహనాల షోరూంలలో తనిఖీలు**

జగిత్యాల, జూలై 8 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పలు ద్విచక్రవాహనాల షోరూంలలో జిల్లా రవాణాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ అధికారి సందని అహ్మద్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో, కొన్ని షోరూంలు టీఆర్ (తాత్కాలిక) రిజిస్ట్రేషన్ లేకుండానే వాహనాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన షోరూంల నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనాల విక్రయంలో అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని షోరూం నిర్వాహకులను హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘన కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దూదేకులలకు ఆత్మగౌరవ భవనం కట్టించాలి

**కోకాపేట్‌లో స్థలం కేటాయించాలి**

**వేమ్ నరేందర్ రెడ్డికి ప్రతినిధుల వినతి**



హైదరాబాద్, జూలై 8 (ఈవార్తలు): తెలంగాణలో దూదేకుల--నూర్ భాషా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కోకాపేట్‌లో ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించాలని తెలంగాణ దూదేకుల--నూర్ భాషా రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజీమొద్దీన్ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని రోల్ హిల్స్‌లో ఆయనను కలిసి దూదేకుల--నూర్ భాషా వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అజీమొద్దీన్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జారీ చేసిన జీవో నెం.125 ద్వారా దూదేకుల ఫెడరేషన్‌కు గుర్తింపు లభించిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఫెడరేషన్ ఏర్పడి, కార్పొరేషన్ కొనసాగుతున్నప్పటికీ తెలంగాణలో మాత్రం 16 సంవత్సరాలు గడిచినా ఆ జీవో అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ--బీ కేటగిరీలో ఉన్న దూదేకుల--నూర్ భాషా కులస్తులు సంప్రదాయ కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నప్పటికీ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఇటీవల బీసీలకు సంబంధించి 18 కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, దూదేకుల--నూర్ భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం తమ వర్గానికి తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. తమ అస్తిత్వం, ఆత్మగౌరవానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదని పేర్కొన్నారు. ఈ అంశాలపై స్పందించిన ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, దూదేకుల--నూర్ భాషా వర్గం సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వశీం అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ మహమ్మద్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. రజాక్, రాష్ట్ర సలహాదారు ఎం.డి. బషీర్, అధికార ప్రతినిధి ఎం.డి. యాకుబ్, అహ్మద్ హుస్సేన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సమద్ భాయ్, యువజన విభాగం అధ్యక్షుడు అహ్మద్ పాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.డి. హసీనా, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్సర బేగం, రాష్ట్ర కోశాధికారి ఎం.డి. యూసుఫ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ షేక్ రఫీ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



## చొప్పదండి అభివృద్ధికి మరింత ఊపు

**కాంగ్రెస్‌లో చేరికలపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, జూలై 8 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండల కేంద్రానికి చెందిన చిరుత మంగ తన అనుచరులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర ప్రజా కార్యాలయంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేశ్, సర్పంచ్ రేండ్ల శ్రీనివాస్, వేముల భాస్కర్, పడాల రాజన్న, మాజీ జెడ్పీటీసీ గునుకొండ బాబు, నాయకులు సాగి అజయ్ రావు, కర్ర బాపురెడ్డి, కంకణాల రాజగోపాల్ రెడ్డి, గంగినేని నవీన్, గడ్డం జానీ, దాతు అంజి, తాళ్ల శ్రీనివాస్, జారతి సత్తయ్య, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం: దొడ్ల వెంకటేశ్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 8 (ఈవార్తలు): ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారిపై చేపడుతున్న 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులను మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉషముళ్లపూడి కమాన్-గాజులరామరం మార్గంలో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిశ్కారం కల్పించేందుకు 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు గతంలోనే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీతో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించి కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న భారీ బండరాళ్ల తొలగింపు, చెట్ల కొమ్మల కత్తిరింపు, విద్యుత్ స్తంభాల స్థాన మార్పు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఆల్విన్ కాలనీ, శంషీగూడ ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, జిల్లా గణేశ్, ఇస్మాయిల్, షౌకత్ అలీ మున్నా, మల్లేశ్, నాగేశ్ గౌడ్, రవీందర్, ఖలీమ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వయ్యారి చిత్రం


ఈషా గుప్తా




## దాదా.. గంగూలీ చొక్కా
# సీన్ రీ క్రియేట్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, 'బెంగాల్ టైగర్' సౌరవ్ గంగూలీ బయోపిక్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు చిత్రబృందం అద్భుతమైన కానుక ఇచ్చింది. గంగూలీ 54వ పుట్టినరోజు సందర్భంగా బుధవారం, ఆయన బయోపిక్ 'దాదా: ది సౌరవ్ గంగూలీ స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో గంగూలీ పాత్రను జాతీయ అవార్డు గ్రహీత రాజ్ కుమార్ రావు పోషిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మే 14న విడుదల కానున్నట్టు ప్రకటించారు. రాజ్ కుమార్ రావు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకుంటూ గంగూలీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోస్టర్‌లో 2002లో లార్డ్స్ బాల్కనీలో గంగూలీ చొక్కా విప్పి గాల్లో తిప్పుతూ సంబరాలు చేసుకున్న చారిత్రాత్మక దృశ్యాన్ని రాజ్ కుమార్ రావు పునఃసృష్టించారు. ఆయన వెనుక భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడుతూ కనిపించింది. పోస్టర్‌పై "ఆయన ఆట ఆడటమే కాదు.. ఆటనే మార్చేశాడు" అనే ట్యాగ్‌లైన్ ఆకట్టుకుంటోంది. 2002లో ఇంగ్లండ్‌తో జరిగిన నాట్‌వెస్ట్ ట్రోఫీ ఫైనల్‌లో 325 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ఛేదించి చారిత్రాత్మక విజయం సాధించింది. ఆ గెలుపు తర్వాత గంగూలీ తన ఆనందాన్ని ఆపుకోలేక లార్డ్స్ బాల్కనీలో షర్ట్ విప్పి గిరగిరా తిప్పారు. ఆ రోజు భారత క్రికెట్ రూపురేఖలను మార్చిన ఘటనగా నిలిచిపోయింది. 'మనం గెలుస్తామని నేను అస్సలు నమ్మలేదు' అని ఆ విజయం తర్వాత గంగూలీ చెప్పిన మాటలు అప్పట్లో సంచలనం సృష్టించాయి.

## ప్రొడ్యూసర్‌గా
# కమల్ హాసన్ జోరు

లోకనాయకుడు కమల్ హాసన్ తన కెరీర్‌లో ఎన్నడూ లేనంత స్పీడ్ పెంచారు. ఒకవైపు నటుడిగా, మరోవైపు రాజకీయ నాయకుడిగా ఫుల్ బిజీగా ఉంటూనే, ఇప్పుడు ప్రొడ్యూసర్‌గా సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. తన సొంత బ్యానర్ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' పై మునుపెన్నడూ లేని విధంగా టాప్ స్టార్స్, క్రేజీ డైరెక్టర్లతో భారీ సినిమాలను లైన్లో పెట్టారు. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న సినిమా 'ధర్మన్'. అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఎన్నో చర్చల తర్వాత ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ఇక ఇందులో రజనీ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం సౌత్‌లో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శివకార్తికేయన్‌తో కమల్ హాసన్ 'సేయోన్' అనే సినిమాను నిర్మిస్తున్నారు. శివకుమార్ మురుగేషన్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే గ్రాండ్‌గా ప్రారంభమైంది. శిఇక వకార్తికేయన్‌కు ఉన్న పాన్-ఇండియా క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆర్కేఎఫ్ఐ సంస్థ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. దీనికి సంబంధించిన రిలీజ్ ప్లాన్స్‌ను మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు. తమిళ ఇండస్ట్రీలోనే కాకుండా ఇండియన్ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ మల్టీస్టారర్ మూవీకి కమల్ హాసన్ రెడీ అయ్యారు. కమల్ హాసన్, రజనీకాంత్ కలిసి నటించబోయే ఈ భారీ చిత్రానికి 'జైలర్' ఫేమ్ నెల్సన్ దర్శకత్వం వహించనున్నారు. ఇక ఈ ఏడాది ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ కాగా, వచ్చే ఏడాది నుండి షూటింగ్ ప్రారంభం కానుంది. రెడ్ జెయింట్ మూవీస్, రాజ్ కమల్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక చిత్తా, వీర ధీర సూరన్ సినిమాలతో టాలెంట్ నిరూపించుకున్న డైరెక్టర్ ఎస్‌యూ అరుణ్ కుమార్‌తో సినిమా చేయడానికి కమల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అరుణ్ కుమార్ రెండు క్రేజీ స్టోరీలను రెడీ చేయగా, త్వరలోనే కమల్ హాసన్ వీటికి సంబంధించిన పూర్తి నరేషన్ విననున్నారు. ఇక స్క్రిప్ట్ నచ్చితే కమల్ హాసన్ స్వయంగా హీరోగా నటిస్తారు, లేదంటే ఆర్కేఎఫ్ఐ బ్యానర్‌లోనే మరో టాప్ హీరోతో ఈ సినిమాను నిర్మిస్తారు. ఇతర హీరోల సినిమాలతో పాటు కమల్ హాసన్ తన కోసం రెండు కొత్త స్క్రిప్ట్‌లను ఫైనల్ చేసే పనిలో ఉన్నారు. వీటిలో ఒక కథ త్వరలోనే లాక్ కానుంది. మొత్తానికి నటుడిగా, ప్రొడ్యూసర్‌గా కమల్ హాసన్ పడుతున్న ఈ కష్టం చూసి ఇండస్ట్రీ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి.



## 'మార్క్ మై ట్వీట్' అంటున్న ప్యారడైజ్



నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా ది ప్యారడైజ్ రిలీజ్ కు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ, ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల సినిమా క్లైమాక్స్‌కు సంబంధించిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. ముఖ్యంగా ఈ సినిమాలో ఆయా షేర్ సాంగ్ కు లిరిక్స్ అందించిన కాసర్ల శ్యామ్ నుంచి వచ్చిన రెస్పాన్స్ కావడంతో అభిమానులు దానిని మరింత ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. సినిమా షూటింగ్‌ను డైరెక్ట్ గా చూసిన తర్వాత చేసిన ఆ ట్వీట్‌లో మార్క్ మై ట్వీట్ అనే కామెంట్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. సాధారణంగా సినిమా రిలీజ్ కు ముందు యూనిట్ సభ్యులు ఇలాంటి కామెంట్స్ చేయడం అరుదు. అందుకే ఈ ఒక్క కామెంట్‌తోనే సోషల్ మీడియాలో ది ప్యారడైజ్ పేరు ట్రెండింగ్‌లోకి వచ్చింది. క్లైమాక్స్‌లో అసలు ఏముంటుందో, ఎలాంటి ట్విస్ట్ లేదా ఎమోషనల్ హై ఉంటుందో అంటూ ఫ్యాన్స్ తమ తమ అంచనాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఫ్యాన్ పేజీలు, సినీ గ్రూపులు, ఎక్స్ పోస్టుల్లో ఈ అంశంపైనే చర్చ కొనసాగుతోంది.



## యష్-కియారా..
# అదే పని!

పాన్ ఇండియా స్టార్ యష్ హీరోగా, డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న భారీ సినిమా టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్ నుంచి మొదటి వీడియో సాంగ్ తబాహీ ఆడియన్స్ ముందుకొచ్చింది. ఇప్పటికే ఆడియోతో ఆసక్తి పెంచిన ఈ సాంగ్ కు ఇప్పుడు రిలీజైన విజువల్ వెర్షన్ మరింత హైప్ తీసుకొచ్చింది. ముఖ్యంగా యష్, కియారా అద్వానీ మధ్య చూపించిన రొమాంటిక్ సీన్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. సాంగ్ స్టార్టింగ్ లో ప్రముఖ సూఫీ కవి రూమీ రాసిన "సరైనది-తప్పు అనే భావనలకు అతీతంగా ఒక ప్రపంచం ఉంది... అక్కడ నిన్ను కలుస్తాను" అనే కోట్ వినిపించడం విశేషం. ఆ భావాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ సాంగ్ లవ్, ఎమోషన్, ఎట్రాక్షన్ కలగలిసిన విజువల్స్ కనిపిస్తున్నాయి. భారీ స్థాయి సెట్స్, స్టైలిష్ ఫ్రేమ్స్, గ్రాండ్ సినిమాటోగ్రఫీతో టాక్సిక్ ప్రపంచాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేశారు. ఈ వీడియోలో యష్, కియారా మాత్రమే కాకుండా నయనతార, తారా సుతారియా కూడా కాసేపు కనిపించారు. కథలో వారి పాత్రలపై ఆసక్తిని పెంచేలా కొన్ని కీలక షాట్లను మాత్రమే చూపించారు. దీంతో సినిమా కథ ఎలాంటి మలుపులు తిరగబోతోందన్న డిస్కషన్ మొదలైంది.

# లెనిన్ విధి నిర్ణయం



అఖిల్ అక్కినేని హీరోగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన లెనిన్ రిలీజ్ కు రెడీ అవుతున్న వేళ, సినిమా చుట్టూ ఆసక్తికరమైన విషయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌తో మంచి బజ్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన భాగ్యశ్రీ బోర్సే తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట శ్రీలీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, ఆ అవకాశాన్ని భాగ్యశ్రీ బోర్సే అందుకుంది. ఈ నేపథ్యంలో శ్రీలీల చేయాల్సిన సినిమా మీకు రావడం అదృష్టంగా భావిస్తున్నారా? అనే ప్రశ్నకు భాగ్యశ్రీ ఎంతో పరిణితితో స్పందించింది. ప్రతి కథ అందులో ఎవరు నటించాలో ముందే నిర్ణయించుకుంటుందని, ఒక పాత్ర ఎవరికి దక్కాలో అది విధే నిర్ణయిస్తుందని, లెనిన్ లో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఈ అవకాశం రావడం వెనుక కూడా ఆ డెస్టినీనే ఉందంటూ ఆమె చెప్పిన మాటలు ఆకట్టుకుంటున్నాయి. మరో హీరోయిన్ చేయాల్సిన పాత్ర తనకు రావడంపై ఎలాంటి పోలికలు లేకుండా, కథపై నమ్మకంతో ఆమె ఇచ్చిన సమాధానం ప్రశంసలు అందుకుంటోంది.



## కలర్స్ స్వాతి రెండో పెళ్లి

'కలర్స్' ప్రోగ్రామ్‌తో క్రేజీ యాంకర్‌గా పరిచయమై, ఆ తర్వాత హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కలర్స్ స్వాతి తాజాగా రెండో వివాహం చేసుకున్నారు. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఎవరూ ఊహించని విధంగా ఆమె సైలెంట్‌గా పెళ్లిపీటలు ఎక్కడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తన రీఎంట్రీ మూవీ డైరెక్టర్‌తోనే ఆమె ఏడడుగులు నడిచారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పెళ్లి ఫొటోలను పంచుకుంది. అంతేకాదు, వరుడిని పరిచయం చేస్తూ దర్శకుడు శ్రీకాంత్ నాగోతిని ట్యాగ్ చేశారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా, కేవలం కుటుంబ సభ్యులు మరియు అత్యంత సన్నిహితుల సమక్షంలో చాలా సాదాసీదాగా ఈ వివాహ వేడుక జరిగినట్లు తెలుస్తోంది. ఇక ఒక్కసారిగా స్వాతి తన పెళ్లి ఫొటోలు షేర్ చేయడంతో అభిమానులంతా ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, స్వాతి పెళ్లాడిన శ్రీకాంత్ నాగోతి మరెవరో కాదు.. ఆమె రీఎంట్రీ ఇచ్చిన 'మంత్ ఆఫ్ మధు' సినిమా దర్శకుడే. ఆ సినిమా షూటింగ్, ప్రమోషన్ల సమయంలోనే వీరిద్దరి మధ్య మంచి బాండింగ్ ఏర్పడిందని సమాచారం.



## గ్లామర్ పాత్రలకు సమంత గుడ్‌బై?

సమంత మరో సంచలనం నిర్ణయం తీసుకుందా? అంటే అవుననే తెలుస్తోంది. విజయాలతో దూసుకుపోతున్న సమంత కొంత కాలం పాటు కమర్షియల్ మాస్ చిత్రాలకు దూరంగా ఉంటూ పూర్తిగా ఉమెన్ సెంట్రిక్ సినిమాలపై దృష్టి సారించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. గ్లామర్ పాత్రలు లేదా స్టార్ హీరోల పక్కన ఉండే పరిమిత పాత్రల కంటే కథలో తానే ప్రధాన శక్తిగా నిలిచే పాత్రలకే అమ్మడు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటుంది అన్న విషయం వెలుగులోకి వచ్చింది. కెరీర్ గ్రాఫ్‌ను కొత్త మలుపు తిప్పే దిశగా సమంత తీసుకున్న నిర్ణయం టాలీవుడ్ లో చర్చకు దారితీస్తోంది.








# క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్

వాంకోవర్: ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది. ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్‌సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.

# మెస్సీ కోసం ఫిఫా రిగ్గింగ్

## ఈజిప్ట్ కోచ్

అట్లాంటా: ఫిఫా వరల్డ్‌కప్ టోర్నమెంట్ రిగ్గింగ్‌కు గురైనట్లు ఈజిప్ట్ కోచ్ హోసమ్ హసన్ ఆరోపణ చేశారు. అర్జెంటీనా కోసం, మెస్సీ కోసం.. ఫిఫా ఆ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆయన విమర్శించారు. అట్లాంటా స్టేడియంలో మంగళవారం జరిగిన థ్రిల్లర్ మ్యాచ్‌లో అర్జెంటీనా 3-2 గోల్స్ తేడాతో విజయం సాధించి క్వార్టర్స్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు ఓటమి అంచు నుంచి అర్జెంటీనా అనూహ్య రీతిలో విక్టరీని నమోదు చేసింది. ఓ దశలో 0-2 గోల్స్ తేడాతో వెనుకబడ్డ అర్జెంటీనా.. ఆఖరి 13 నిమిషాల్లో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. రోమిరో, మెస్సీ, ఫెర్నాండేజ్ చకచకా గోల్స్ చేయడంతో.. ఈజిప్ట్ షాక్‌కు గురైంది. డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా ఓటమి ఖాయం అనుకున్న దశలో.. మెస్సీ బృందం మెరుపు వేగంతో మూడు గోల్స్ చేసి అందర్నీ స్టన్ చేసింది. అయితే ఈజిప్ట్ జట్టు మాత్రం ఈ విక్టరీ పట్ల విమర్శలు చేస్తోంది. అర్జెంటీనా కోసం, ఆ జట్టు కెప్టెన్ మెస్సీ కోసం టోర్నీని రిగ్గింగ్ చేసినట్లు ఈజిప్ట్ ఆరోపిస్తున్నది. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈజిప్ట్ కోచ్ హోసమ్ హసన్ మాట్లాడారు. తమ మ్యాచ్‌లో బాహ్య వత్తిళ్లు పనిచేసినట్లు ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ ముగిసే వరకు వీలైనంత వరకు మెస్సీ ఉండాలన్న ఉద్దేశంతో ఫిఫా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అందుకే మ్యాచ్‌లో అనేక అంశాలు ఆ ప్రభావానికి గురైనట్లు ఆయన ఆరోపించారు. డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా కన్నా మా జట్టు బాగా ఆడిందని, అన్నింటిలో ఉత్తమంగా ఉన్నామని, కానీ మ్యాచ్ ఫలితంపై కొన్ని వత్తిళ్లు ప్రభావం చూపినట్లు ఆయన పేర్కొన్నారు. వరల్డ్ చాంపియన్ అర్జెంటీనాను పోటీల్లోనే నిలపాలన్న ఉద్దేశంతో ఫిఫా వ్యవహరించినట్లు ఆయన ఆరోపించారు. బహుశా మెస్సీ కూడా ఇంకా టోర్నీలో ఆడాలన్న ఆలోచనతో నిర్వహకులు కొన్ని నిర్ణయాలు తీసుకుని ఉంటారని తెలిపారు. ఫుట్‌బాల్ ఆటలో టెక్నికల్ అంశాల కన్నా.. కొన్ని బయటి అంశాలే ప్రభావాన్ని చూపుతాయని విమర్శించారు. ప్రపంచ చాంపియన్ అర్జెంటీనాకు అన్ని దశల్లోనూ మద్దతు దొరికిందన్నారు. ఓ దశలో తమ జట్టు చేసిన గోల్‌ను వీఏఆర్ ద్వారా అడ్డుకున్నట్లు ఆయన ఆరోపించారు. ఆటలో మర్యాద, మంచితనం లేదని, తమకు రావాల్సిన పెనాల్టీ ఇవ్వలేదని, కనీసం వీఏఆర్ చెకింగ్ చేయలేదని, ఓ ప్లేయర్ షర్ట్ లాగేశాడని, కానీ వీఏఆర్ చెక్ జరగలేదని, జీవితం సరైన రీతిలో లేదని, సాధారణ జీవితం కష్టమే అని, ఆటలో ఫెయిర్‌నెస్ లేదని కోచ్ హసన్ పేర్కొన్నారు. తమకు హార్డ్ లక్ జరిగిందని, సరైన రీతిలో తమ జట్టును ట్రీట్ చేయలేదని, తమకు అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో ఎక్కడా న్యాయం జరగలేదని ఆయన పేర్కొన్నారు. అయితే ఈజిప్ట్ మేనేజర్ హసన్ చేసిన వ్యాఖ్యలపై ఫిఫా స్పందించే అవకాశాలు ఉన్నాయి. ఈజిప్ట్ జట్టుపై కూడా జరిమానా విధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.





# ఎనిమిది జట్ల 'గోల'!

## ఫిఫా క్వార్టర్ ఫైనల్స్ షెడ్యూల్ ఇదే

ఫిఫా ప్రపంచకప్ 2026 క్వార్టర్ ఫైనల్ దశకు చేరింది. ఇక్కడి నుంచి మ్యాచ్‌లు మరింత రసవత్తరంగా మారనున్నాయి. లీగ్ దశలో 48 జట్లు పోటీపడితే అందులో నుంచి 32 జట్లు రౌండ్ ఆఫ్ 32కు చేరాయి. అక్కడి నుంచి 16 జట్లు ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాయి. ఇప్పుడు క్వార్టర్ ఫైనల్లో 8 జట్లు (అర్జెంటీనా, ఫ్రాన్స్, స్పెయిన్, నార్వే, బెల్జియం, ఇంగ్లండ్, మొరాకో, స్విట్జర్లాండ్) అమీతుమీకి సిద్ధమ వుతున్నాయి. ఈ ఫిఫాలో భారీ అంచనాలు పెట్టుకున్న పెద్ద జట్లలో చాలా వరకు నిష్క్రమించడం గమనార్హం. జర్మనీ, పోర్చుగల్, నెదర్లాండ్స్, క్రొయేషియా లాంటి జట్లు ప్రిక్వార్టర్స్‌లోనే తమ ఆటను ముగించాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా తమ స్థాయికి తగ్గట్లే వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆ జట్టు స్టార్ ఆటగాడు లియోనల్ మెస్సీ 5 మ్యాచ్‌ల్లో 8 గోల్స్, ఒక అసిస్ట్‌తో గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా తమ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శిస్తూ వస్తోంది. ముఖ్యంగా ఆ జట్టు యువ సంచలనం కైలియన్ ఎంబాపె 5 మ్యాచ్‌ల్లో ఏడు గోల్స్‌తో మెస్సీని అనుసరిస్తున్నాడు. అన్నీ కుదిరితే 2022 ఫిఫాలో ఫైనల్లో తలపడిన అర్జెంటీనా, ఫ్రాన్స్‌లు ఈసారి సెమీస్ లేదా మరోసారి ఫైనల్లో తలపడే అవకాశముంది. మరోవైపు మాజీ చాంపియన్లు స్పెయిన్, ఇంగ్లండ్‌తో పాటు బెల్జియం తమ స్థాయి ఆటతీరుతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టాయి. ఇక ఎవరూ ఊహించని రీతిలో మొరాకో నార్వే, స్విట్జర్లాండ్ కూడా ప్రిక్వార్టర్స్‌లో అదరగొట్టి క్వార్టర్స్‌లో ప్రవేశించాయి. క్వార్టర్ ఫైనల్లో గెలిచిన నాలుగు జట్లు జూలై 15, 16వ తేదీల్లో జరగనున్న సెమీఫైనల్స్‌లో తలపడనున్నాయి. ఇక ప్రతిష్టాత్మక ఫిఫా ఫైనల్ జూలై 19 (ఆదివారం) తెల్లవారుజామున 2.30 గంటలకు జరగనుంది.

### క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ షెడ్యూల్:

**ఫ్రాన్స్ వర్సెస్ మొరాకో, జూలై 10, తెల్లవారుజామున 1.30 గంటలకు, వేదిక: బోస్టన్**

**స్పెయిన్ వర్సెస్ బెల్జియం, జూలై 11, అర్ధరాత్రి 12.30 గంటలకు, వేదిక: లాస్ ఏంజెలెస్**

**నార్వే వర్సెస్ ఇంగ్లండ్, జూలై 12, 2.30 గంటలకు, వేదిక: మియామి స్టేడియం**

**అర్జెంటీనా వర్సెస్ స్విట్జర్లాండ్, జూలై 12, ఉదయం 6.30 గం, వేదిక: కాన్సాస్ సిటీ**

# ఈజిప్ట్ కోచ్ వర్సెస్ మెస్సీ



అట్లాంటా: ఫిఫా వరల్డ్‌కప్‌లో అనూహ్య రీతిలో అర్జెంటీనా 3-2 గోల్స్ తేడాతో ఈజిప్ట్‌పై గెలిచిన విషయం తెలిసిందే. ఓ దశలో 0-2 గోల్స్ తేడాతో వెనుకబడ్డ అర్జెంటీనా.. ఆఖరి నిమిషాల్లో ప్రత్యర్థిని స్టన్ చేసింది. అయితే మ్యాచ్ ముగిసిన సమయంలో.. ఈజిప్ట్ కోచ్ హోసమ్ హసన్, అర్జెంటీనా కెప్టెన్ లియోనిల్ మెస్సీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మైదానంలోని టచ్‌లైన్ వద్ద .. ఈజిప్ట్ కోచ్ దూకుడుగా ప్రవర్తించారు. మిగతా కోచింగ్ సిబ్బంది కూడా మెస్సీపై దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే ఆ కోచింగ్ స్టాఫ్ వ్యక్తికి రెడ్‌కార్డ్ జారీ చేశారు. అర్జెంటీనా స్టన్నింగ్ రీతిలో నెగ్గడంతో.. మైదానంలో నాటకీయ పరిణామం చోటుచేసుకున్నది. ఈజిప్ట్ కోచ్ హసన్ ఓ దశలో తన చేతులతో ఓ విభిన్నమైన సంకేతాన్ని చేశారు. మెస్సీపై దూసుకెళ్లే ప్రయత్నం చేస్తూ.. తన చేతులను ఎక్స్ తరహాలో క్రాస్‌లో పెట్టి నిరసన వ్యక్తం చేశాడు. మెస్సీని ఉద్దేశిస్తూ ఈజిప్ట్ కోచ్ నిరసన వ్యక్తం చేయడంతో.. అక్కడే ఉన్న ఫిఫా మ్యాచ్ అఫీషియల్స్ అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఫైనల్ విజిల్ తర్వాత టచ్‌లైన్ వద్ద ఉన్న హసన్ దిశగా మెస్సీ వెళ్లాడు. అయితే ఆ ఇద్దరి మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో తెలియదు. కానీ ఈజిప్ట్ కోచ్ తన చేతులను ఎక్స్ రూపంలో పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మెస్సీపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు ఈజిప్ట్ కోచ్‌పై ఆరోపణలు వస్తున్నాయి. అతనిపై ఫిఫా నియమావళి ప్రకారం చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రెండు గోల్స్‌తో లీడింగ్‌లో ఉన్న ఈజిప్ట్ .. ఆఖరి నిమిషాల్లో షాక్ అయ్యింది. అర్జెంటీనా తేరుకుని వెంటవెంటనే గోల్స్ చేయడంతో ఈజిప్ట్ 3-2 తేడాతో ఖంగుతిన్నది. అయితే మ్యాచ్ రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఈజిప్ట్ ఆరోపించింది. భారీ అప్‌సెట్ తప్పదనుకున్న తరుణంలో.. మెస్సీ సేన అనూహ్య రీతిలో పరాభవం నుంచి గట్టెక్కింది. దీంతో ఈజిప్ట్ కోచ్‌తో సహా ప్లేయర్లు కూడా అర్జెంటీనాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

# నక్వీ ట్రోఫీ ఇస్తలేడు: బీసీసీఐ




ఆసియా కప్-2025 ముగిసి దాదాపు తొమ్మిది నెలలు పూర్తైంది. అయినప్పటికీ చాంపియన్‌గా నిలిచిన టీమిండియా చేతికి ట్రోఫీ ఇంకా రానేలేదు. ఇప్పటికీ ఆసియా క్రికెట్ మండలి ఈ విషయంపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. కాగా గతేడాది టీ20 ఫార్మాట్లో నిర్వహించిన ఆసియా కప్ టోర్నీలో సూర్యకుమార్ సేన విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్లో పాకిస్తాన్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి టీమిండియా ట్రోఫీని గెలుచుకుంది. అయితే, నాడు పహల్గామ్ ఉగ్రదాడి.. అందుకు బదులుగా ఆపరేషన్ సింధూర్ జరిగిన నేపథ్యంలో భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏసీసీ అధ్యక్షుడు, పాక్ మంత్రి అయిన మొహ్సిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు టీమిండియా నిరాకరించింది. దీంతో నక్వీ ట్రోఫీని తనతో పాటు పాకిస్తాన్‌కు ఎత్తుకెళ్లిపోయాడనే వార్తలు వచ్చాయి. అంతేకాదు.. తన అనుమతి లేకుండా ఏసీసీ కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించవద్దని.. ట్రోఫీ ఎవరికీ ఇవ్వద్దని అతడు ఆదేశించినట్లు సమాచారం. దీంతో తొమ్మిది నెలల కాలం గడిచినా ట్రోఫీ ఇంకా టీమిండియాకు చెంతకు చేరనేలేదు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రజల ప్రశ్నలకు జవాబేది?

ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రభుత్వానికి ఒక అవకాశం ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ఆ ప్రభుత్వ ప్రధాన బాధ్యత. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న వేళ, ఈ కాలంలో సాధించిన విజయాల కంటే నెరవేరని హామీలు, ఆలస్యమైన నిర్ణయాలు, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామీలతో ప్రజలను ఆకర్షించింది. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగులు, వృద్ధులు.. ప్రతి వర్గానికీ ప్రత్యేక హామీలు ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు ఆశించిన వేగంతో జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పథకాలు ప్రారంభమైనప్పటికీ, మరికొన్ని అమలులో జాప్యం, అర్హుల ఎంపికలో సమస్యలు, నిధుల కొరత వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తికి కారణమయ్యాయి. వ్యవసాయ రంగం ఇప్పటికీ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సాగునీటి నిర్వహణ, రైతులకు సకాలంలో మద్దతు, పంట కొనుగోళ్లు, మార్కెట్ స్థిరీకరణ వంటి అంశాల్లో మరింత సమర్థవంతమైన చర్యలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రైతు సంక్షేమాన్ని కేవలం ప్రకటనలతో కాకుండా, భూమిపై కనిపించే చర్యలతో నిరూపించాల్సిన అవసరం ఉంది. నిరుద్యోగ యువత పరిస్థితి కూడా పెద్ద ప్రశ్నగానే మిగిలింది. ఉద్యోగ నియామకాలపై ఆశలు పెంచిన ప్రభుత్వం, వాటిని వేగంగా పూర్తి చేయాలన్న ప్రజల అంచనాలను పూర్తిగా అందుకోలేదని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు పరిశ్రమల ద్వారా ప్రైవేటు రంగంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా ఆశించిన పురోగతి కనిపించడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, పెట్టుబడులు, పారిశ్రామిక విస్తరణ, కొత్త ఉపాధి అవకాశాల విషయంలో మరింత చురుకైన చర్యలు అవసరమనే అభిప్రాయం పరిశ్రమల వర్గాల నుంచి వినిపిస్తోంది. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు, వాటిని త్వరగా కార్యరూపంలోకి తీసుకురావడం కూడా అంతే ముఖ్యం. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ పాలన, ట్రాఫిక్ సమస్యలు, తాగునీటి సరఫరా, విద్య, వైద్యం వంటి రంగాల్లో కూడా ప్రజలు వేగవంతమైన మార్పును ఆశించారు. కొన్ని రంగాల్లో చర్యలు చేపట్టినా, అవి రాష్ట్రవ్యాప్తంగా స్పష్టమైన ఫలితాలుగా కనిపించేందుకు ఇంకా సమయం అవసరమనే అభిప్రాయం ఉంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న అప్పులు, ఆదాయం-వ్యయం సమతుల్యం వంటి అంశాలపై కూడా ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉంది. సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా ముందుకు సాగినప్పుడే పాలన విజయవంతమవుతుంది. అయితే, ఏ ప్రభుత్వ పనితీరునైనా పూర్తిగా ఒకే కోణంలో చూడడం సరైంది కాదు. కొన్ని రంగాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలు, కొన్ని హామీల అమలు, పరిపాలనా నిర్ణయాలు కూడా ఉన్నాయి. కానీ ప్రజలు ప్రభుత్వాన్ని అంచనా వేసేది ప్రకటనలతో కాదు; తమ జీవితాల్లో కనిపించే మార్పుతో. అదే ప్రజాస్వామ్య సారాంశం. రెండున్నరేళ్ల పాలన తర్వాత ప్రజల్లో తలెత్తుతున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే.. ఎన్నికల సమయంలో చూపిన దిశలో రాష్ట్రం నిజంగా ప్రయాణిస్తోందా? లేక వాగ్దానాలు, ప్రకటనలకే పరిమితమైందా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సింది ప్రభుత్వం. మిగిలిన కాలంలో ఇచ్చిన హామీలను వేగంగా అమలు చేసి, అభివృద్ధి ఫలితాలను ప్రజలకు అందించడం ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచగలదు. ప్రజాస్వామ్యంలో చివరికి తీర్పు ఇచ్చేది ప్రజలే; ఆ తీర్పుకు పునాది ప్రభుత్వ పనితీరే.

# అవినీతి నిర్మూలన.. పెద్ద జోక్!

**అవినీతి అనేది ఒక దేశ ఆర్థికాభివృద్ధిని, పరిపాలనా సామర్థ్యాన్ని, ప్రజాస్వామ్య విలువలను లోపల నుంచే కుంగదీసే మహమ్మారి. ప్రభుత్వ కార్యాలయం నుంచి గ్రామ పంచాయతీ వరకు, చిన్నపాటి సేవల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు ఎక్కడైనా అవినీతి చోటు చేసుకుంటే దాని భారం చివరకు సామాన్య ప్రజలపైనే పడుతుంది. ప్రభుత్వాలపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. అభివృద్ధి మందగిస్తుంది.**

**నాణ్యమైన సేవలు ప్రజలకు చేరవు. అందుకే అవినీతి నిర్మూలన అనేది ఏ ప్రభుత్వానికైనా అత్యంత ప్రాధాన్యమైన లక్ష్యంగా ఉండాలి. ఇటీవలి కాలంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో అవినీతి నిరోధక సంస్థలు, దర్యాప్తు సంస్థలు పెద్దఎత్తున దాడులు నిర్వహించడం, అక్రమాస్తులను గుర్తించడం, ఉన్నతాధికారులపై కేసులు నమోదు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.**

ఈ చర్యలు ప్రభుత్వాలు అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని ఇస్తున్నాయి. అయితే ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న తలెత్తుతోంది. కేవలం కఠిన చర్యలు, అరెస్టులు, దాడులు మాత్రమే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలవా? లేక వ్యవస్థలో మరింత లోతైన సంస్కరణలు కూడా అవసరమా? అవినీతికి శిక్ష తప్పనిసరి. చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తి ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రం ప్రజాస్వామ్యానికి ప్రాణం. అక్రమ సంపాదనకు పాల్పడిన వారిపై వేగంగా, నిష్పాక్షికంగా చర్యలు తీసుకుంటే ప్రజల్లో చట్టంపై నమ్మకం పెరుగుతుంది. నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు కూడా అది ఒక నైతిక బలాన్నిస్తుంది. శిక్ష భయం లేకుంటే అవినీతి మరింత విస్తరించే ప్రమాదం ఉంది. అందువల్ల కఠిన చర్యలు అవసరం అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు.



అయితే అవినీతి అనేది కేవలం వ్యక్తుల వల్ల మాత్రమే పుట్టే సమస్య కాదు; వ్యవస్థలోని లోపాల వల్ల కూడా పెరుగుతుంది. అనవసర అనుమతులు, క్లిష్టమైన విధానాలు, అధిక అధికార కేంద్రీకరణ, నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడం, సేవలలో జాప్యం వంటి అంశాలు అవినీతికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. ప్రజలు ఒక పని త్వరగా పూర్తి కావాలనే ఉద్దేశంతో లంచం ఇవ్వడానికి సిద్ధపడితే, అధికారులు దానిని అవకాశంగా మార్చుకునే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి వ్యక్తులను శిక్షించడంతో పాటు అవినీతికి అవకాశం కల్పించే వ్యవస్థను కూడా మార్చాల్సిన అవసరం ఉంది. డిజిటల్ పాలన ఈ విషయంలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లో అందించడం, దరఖాస్తులు, చెల్లింపులు, అనుమతులు, టెండర్లను డిజిటల్ విధానంలో నిర్వహించడం వల్ల మానవ జోక్యం తగ్గుతుంది. ఫలితంగా అవినీతి అవకాశాలు కూడా తగ్గుతాయి. భూమి రికార్డులు, పన్ను చెల్లింపులు, ప్రభుత్వ కొనుగోళ్లు, సంక్షేమ పథకాల అమలు వంటి రంగాల్లో సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తే పారదర్శకత గణనీయంగా పెరుగుతుంది. అవినీతి నిరోధక సంస్థలు కూడా పూర్తిస్థాయి స్వతంత్రతతో పనిచేయాలి. విచారణలు రాజకీయ ప్రభావాలకు అతీతంగా, ఆధారాలపై మాత్రమే సాగాలి. చట్టం ఎంపిక చేసుకుని పనిచేస్తోందనే అనుమానం ప్రజల్లో కలిగితే అవినీతి వ్యతిరేక పోరాటం విశ్వసనీయత కోల్పోతుంది. కాబట్టి దర్యాప్తు వేగవంతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగడం అత్యంత అవసరం. నేరం నిరూపితమైతే శిక్ష కూడా వేగంగా అమలవ్వాలి. సంవత్సరాల తరబడి కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం అవినీతి నిరోధక వ్యవస్థ ప్రభావాన్ని తగ్గిస్తుంది. సమాజం పాత్ర కూడా ఇక్కడ ఎంతో కీలకం. లంచం తీసుకోవడం నేరమైతే, లంచం ఇవ్వడం కూడా చట్టవిరుద్ధమే. “పని త్వరగా కావాలంటే ఇదే మార్గం” అనే భావన మారాలి. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవాలి. సమాచార హక్కు, ఫిర్యాదు వ్యవస్థలు, విజిల్‌బ్లోయర్ రక్షణ వంటి చట్టాలను సమర్థంగా వినియోగించాలి. ప్రజల్లో నైతిక విలువలు బలపడినప్పుడే అవినీతి వ్యతిరేక పోరాటానికి నిజమైన బలం లభిస్తుంది.

విద్యా వ్యవస్థ కూడా ఈ దిశగా కీలక పాత్ర పోషించాలి. చిన్ననాటి నుంచే నిజాయితీ, సామాజిక బాధ్యత, ప్రజాధనం పట్ల గౌరవం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించాలి. అవినీతిని తెలివితేటలుగా కాకుండా సమాజానికి నష్టం చేసే చర్యగా భావించే సంస్కృతి ఏర్పడాలి. కుటుంబం, విద్యాసంస్థలు, మీడియా, పౌర సమాజం కలిసి విలువలతో కూడిన సామాజిక వాతావరణాన్ని నిర్మించాలి. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పనితీరు మూల్యాంకనం, పదోన్నతుల్లో పారదర్శకత కూడా అవినీతిని తగ్గించడంలో సహాయపడతాయి. నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రోత్సహించాలి. పనితీరును ఆధారంగా చేసుకుని గుర్తింపు ఇవ్వాలి. అదే సమయంలో అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలి. మంచి పనికి ప్రోత్సాహం, చెడు పనికి శిక్ష..ఈ రెండు కలిసి వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అవినీతి నిర్మూలన ఒకరోజులో జరిగే ప్రక్రియ కాదు. అది నిరంతర యుద్ధం. ఈ పోరాటంలో చట్టాలు, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ, సాంకేతికత, రాజకీయ సంకల్పం, ప్రజల భాగస్వామ్యం.. అన్నీ సమానంగా అవసరం. కఠిన చర్యలు ఈ పోరాటానికి తొలి అడుగు మాత్రమే; చివరి పరిష్కారం కాదు. శిక్షతో పాటు సంస్కరణలు, పారదర్శకతతో పాటు జవాబుదారీతనం, సాంకేతికతతో పాటు నైతిక విలువలు కలిసివచ్చినప్పుడే అవినీతిపై శాశ్వత విజయం సాధించవచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రజాధనం పవిత్రమైనది. ఆ ధనాన్ని దుర్వినియోగం చేసే ప్రతి చర్య సమాజ భవిష్యత్తును దెబ్బతీస్తుంది. అందుకే అవినీతిపై కఠిన చర్యలు కొనసాగాలి. అదే సమయంలో అవినీతి పుట్టుకొచ్చే అవకాశాలను తగ్గించే పరిపాలనా సంస్కరణలు వేగవంతం కావాలి. భయంతో కాదు, బాధ్యతతో నడిచే వ్యవస్థను నిర్మించినప్పుడే నిజమైన అవినీతి రహిత భారతాన్ని నిర్మించగలం. కానీ నేటి పరిస్థితులు చూస్తుంటే అవినీతి నిర్మూలన పెద్ద జోక్‌లా మారింది.

- లక్ష్మీ ప్రసన్న చెన్నమనేని, హైదరాబాద్

ప్రవేశ పరీక్షలు

# ప్రతిభకు కొలమానమా?




ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించే కీలక దశగా ప్రవేశ పరీక్షలు మారాయి. వైద్యం, ఇంజినీరింగ్, న్యాయ విద్య, మేనేజ్‌మెంట్, వ్యవసాయ విద్య, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం.. దాదాపు ప్రతి ఉన్నత విద్యా కోర్సుకు ఇప్పుడు ఒక ప్రవేశ పరీక్ష తప్పనిసరి. ఒకప్పుడు ఇంటర్మీడియట్ లేదా బోర్డు పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేవారు. కానీ కాలక్రమేణా జాతీయ స్థాయిలో ఏకరీతి ప్రమాణాలను తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రవేశ పరీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. అయితే ఈ పరీక్షలు నిజంగా విద్యార్థి ప్రతిభను కొలుస్తున్నాయా? లేక పరీక్ష రాసే నైపుణ్యాన్ని మాత్రమే అంచనా వేస్తున్నాయా? అనే ప్రశ్న నేడు విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య విస్తృత చర్చకు దారి తీస్తోంది. ప్రవేశ పరీక్షల ఆవశ్యకతను పూర్తిగా కొట్టిపారేయలేం. దేశవ్యాప్తంగా వివిధ విద్యా బోర్డులు అమలు చేస్తున్న సిలబస్, మూల్యాంకన విధానం, మార్కుల కేటాయింపు ఒకేలా ఉండవు. కొన్ని బోర్డుల్లో ఎక్కువ మార్కులు సాధించడం సులభమైతే, మరికొన్నింటిలో కఠినమైన మూల్యాంకనం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం బోర్డు మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తే సమాన అవకాశాల సూత్రం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఒకే విధమైన ప్రశ్నాపత్రం, ఒకే విధమైన మూల్యాంకనంతో నిర్వహించే ప్రవేశ పరీక్షలు విద్యార్థులందరికీ సమాన పోటీ వాతావరణాన్ని కల్పిస్తున్నాయనే వాదనలో వాస్తవం ఉంది. అయితే ప్రతిభ అనేది కేవలం మూడు గంటల పరీక్షలో సాధించిన మార్కులతోనే నిర్ణయించబడదు. ఒక విద్యార్థిలో విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సామాజిక అవగాహన, పరిశోధనా దృక్పథం వంటి అనేక అంశాలు ఉంటాయి. కానీ ప్రస్తుత ప్రవేశ పరీక్షలు ప్రధానంగా ప్రశ్నలకు వేగంగా సమాధానాలు చెప్పే సామర్థ్యాన్నే కొలుస్తున్నాయి. దీంతో విద్యార్థి సమగ్ర ప్రతిభ అంచనాకు నోచుకోవడం లేదు.

మరోవైపు ప్రవేశ పరీక్షల చుట్టూ కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ ఏర్పడింది. పాఠశాల విద్య కంటే కోచింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యం పెరిగింది. కొన్ని కుటుంబాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రత్యేక శిక్షణ ఇప్పించగలుగుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు మాత్రం ఈ అవకాశాన్ని కోల్పోతున్నారు. దీంతో సమాన అవకాశాల లక్ష్యం కొంతవరకు దెబ్బతింటోందనే విమర్శలకు బలం చేకూరుతోంది. ప్రతిభతో పాటు ఆర్థిక స్థోమత కూడా పోటీలో ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడడం ఆందోళన కలిగించే అంశం. విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి కూడా మరో కీలక సమస్య. పదో తరగతి పూర్తి కాకముందే ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ప్రారంభమవుతోంది. రోజుకు పది నుంచి పన్నెండు గంటల పాటు చదవడం, మాక్ టెస్టులు, ర్యాంకుల పోటీ, తల్లిదండ్రుల అంచనాలు, సామాజిక ఒత్తిడి..ఇవన్నీ కలిసి విద్యార్థులపై తీవ్ర మానసిక భారాన్ని మోపుతున్నాయి. ఒక పరీక్షలో ఆశించిన ర్యాంకు రాకపోతే జీవితమే ముగిసిపోయినట్లు భావించే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. విద్య అనేది జ్ఞానాన్ని పెంపొందించే ప్రక్రియ కావాలి గానీ, ఒత్తిడిని పెంచే వ్యవస్థగా మారకూడదు. అయినప్పటికీ ప్రవేశ పరీక్షల వల్ల కొన్ని సానుకూల మార్పులు కూడా వచ్చాయి. ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ చేసి అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందుతున్నారు. ప్రాంతీయ, బోర్డు ఆధారిత అసమానతలు కొంతవరకు తగ్గాయి. ఒకే ప్రమాణంతో విద్యార్థులను అంచనా వేసే అవకాశం ఏర్పడింది. పారదర్శకత పెరిగింది. అవినీతి, సిఫార్సులు, అక్రమ ప్రవేశాల అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. ఇవి ప్రవేశ పరీక్షల ముఖ్యమైన ప్రయోజనాలుగా చెప్పవచ్చు. అయితే పరీక్షల విశ్వసనీయతను కాపాడటం అత్యంత కీలకం. ప్రశ్నాపత్రాల లీకులు, సాంకేతిక లోపాలు, మూల్యాంకన సమస్యలు, పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి సంఘటనలు విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. లక్షలాది మంది భవిష్యత్తును ప్రభావితం చేసే పరీక్షల్లో చిన్న పొరపాటు కూడా తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. కాబట్టి పరీక్షల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలను పాటించడం ప్రభుత్వాలు, పరీక్షల నిర్వహణ సంస్థల బాధ్యత. భవిష్యత్తులో ప్రవేశ పరీక్షల రూపురేఖలు కూడా మారాల్సిన అవసరం ఉంది. కేవలం జ్ఞాపకశక్తిని పరీక్షించే ప్రశ్నలకు బదులుగా విశ్లేషణ, అన్వయ సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను అంచనా వేసే విధంగా ప్రశ్నాపత్రాలు రూపొందించాలి. విద్యార్థి పాఠ్యాంశాన్ని ఎంతగా అర్థం చేసుకున్నాడనే విషయానికే ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే బోర్డు పరీక్షల్లో సాధించిన ప్రదర్శన, పాఠశాల స్థాయి విద్యా పురోగతి, నైపుణ్యాల అంచనా వంటి అంశాలకు కూడా కొంత ప్రాధాన్యం కల్పించే విధానాలను పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది.

విద్య అనేది ర్యాంకుల పోటీ మాత్రమే కాదు; వ్యక్తిత్వ వికాసానికి పునాది. ప్రవేశ పరీక్షలు అవసరమే కానీ అవే ప్రతిభకు అంతిమ కొలమానం కావు. ఒక పరీక్షలో సాధించిన ర్యాంకు విద్యార్థి భవిష్యత్తును పూర్తిగా నిర్వచించలేదు. నిజమైన ప్రతిభ నిరంతర అధ్యయనం, సృజనాత్మకత, క్రమశిక్షణ, కృషి, జీవిత సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యంలో ప్రతిఫలిస్తుంది. అందువల్ల ప్రవేశ పరీక్షలను మరింత పారదర్శకంగా, సమాన అవకాశాలను కల్పించేలా, విద్యార్థుల సమగ్ర ప్రతిభను గుర్తించేలా సంస్కరించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి ప్రపంచస్థాయి నైపుణ్యాలు కలిగిన యువత అవసరం. అలాంటి యువతను ఎంపిక చేసే వ్యవస్థ కూడా సమానత్వం, నాణ్యత, పారదర్శకత, మానవీయత అనే నాలుగు సూత్రాలపై నిర్మితమై ఉండాలి. ప్రవేశ పరీక్షలు ప్రతిభను గుర్తించే సాధనంగా ఉండాలి గానీ, ప్రతిభను పరిమితం చేసే గోడగా మారకూడదు. విద్యార్థి సామర్థ్యాన్ని ఒకే రోజు, ఒకే పరీక్షతో కాకుండా అతని సమగ్ర అభ్యాసం, ఆలోచనా శక్తి, నేర్చుకునే తపన, విలువలతో కలిపి అంచనా వేసినప్పుడే విద్యా వ్యవస్థ తన అసలైన లక్ష్యాన్ని చేరుకోగలదు.



- రామస్వామి చింత, అచ్చంపేట

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY BOMMAKANTI SHRAVAN KUMAR, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: BOMMAKANTI SHRAVAN KUMAR, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.